దిగజారిన మాలిన్యం

పైకెన్ని చెప్పినా ధనికులంటే నాకిష్టం. సామాన్య మానవుడి శ్రేయస్సు కోరతాను. అతనికి మేలుకలిగే యత్నం ఏదైనా జరుగుతూంటే, చేతనైన సహాయం చేస్తాను. ధనిక వర్గాలతో పోల్చిచూస్తే నేనూ సామాన్య మానవుణ్ణే. అయినా సామాన్య మానవుడుగా ఉండడం కంటే, అతని శ్రేయస్కామిగా ఉండడమే నాకిష్టం. ధనికులంటే యిష్టమే అయినా వారితో చనువుగా, స్నేహంగా, అంతా ఒకటిగా మాత్రం ఉండలేను. పరదేశీలపట్ల సాధ్యమయ్యే గౌరవభావం, దూర ప్రాంతాలను గూర్చి "ఎప్పుడో మీ దగ్గరికి వస్తానులే" అని అనిపించే న్యూనత డబ్బున్నవార్ని చూస్తే కలుగుతాయి నాలో. వారి జీవితం గురించి నాకేమీ తెలియదు. ఆ డబ్బంతా ఏమవుతుందో ? వారెల్లా అనుభవిస్తారో ? వారి దైనందిన జీవితం, చేష్టలు, మాటలు అనుక్షణమూ ఆశ్చర్యం కలగచేస్తూండడమే ఆకర్షణకి కారణం అనుకుంటాను. సాధారణంగా మన ఆధిక్యతని ప్రకటిస్తే హర్షించే వ్యక్తులే మనకి సన్నిహితులవుతారు. కాని ఆ స్నేహం, సాంగత్యం ఎల్లప్పుడూ ఆనందాన్నివ్వదు. అది లోయలో నడవడం లాంటిది. నడవగా నడవగా ఒక పర్వతం దగ్గరికి చేరుకుంటాం. పైకి చూస్తే ఎత్తుగా శిఖరం కనిపిస్తుంది. మన అల్పత్వం అప్పుడు మనకు తెలిసొస్తుంది. స్వార్థం దిగజారుతుంది. నమ్రతతో చేతులు జోడిస్తాం. ధనికులతో గడిపిన క్షణాలు యిట్లాంటి అనుభవాన్ని కలగచేస్తాయి.

అందుచేత కాంతారావు రమ్మని వ్రాయగానే, గంతేసి బైలుదేరాను. దూరపు చుట్టరికం ఉన్నా అతనిని నేను బాగా ఎరగను. కులూ లోయలో నాకో నాలుగెకరాల భూమి ఉందనుకుంటే ఎంత తృప్తో, అతను చుట్టమని చెప్పుకున్నా అంతే తృప్తి. మావాళ్ళందరిలోనూ

అంత చిన్నతనంలో అంత పైకొచ్చినవారు మరొకరు లేరు. చాలామంది సంస్కారం, చదువు, హోదా, ఆస్తులు, తెలివి మొదలైన వాటితో నిచ్చెన వేయించుకొని, ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ పైకెడతారు. కాంతారావు అట్లా కాదు. వేటితో నిచ్చెన వేయించాడో మాకు తెలవదు. కింద నిలబడ్డాడు. ఆరేళ్ళ తర్వాత అమాంతం పైన కూర్చున్నాడు. ఎక్కిన నిచ్చెన తన్ని పారేశాడంటారు, గిట్టనివాళ్ళు. ఇందులోని నిజా నిజాలు నాకు తెలవ్వు. ఒక వ్యాపార సంస్థకి అతను అధిపతి. దాని యజమానులు, పెట్టుబడిదారులు పాశ్చాత్యులు. రెండువేలదాకా జీతం. బంగళా, నౌకర్లు, పెద్ద తోట, ఒక కారు, పిల్లలకి ఉచిత విద్యా వైద్య సౌకర్యాలు, ఏడాదికోసారి విమానంలో కుటుంబంతో సహా ఉచిత దేశ యాత్ర. రెండు నెలల "బోనస్"—ఉద్యోగాలిచ్చే కమిటీకి సలహా దారుడు, నెలకిన్ని డబ్బాలు సిగరెట్లు, యిన్ని సీసాలు మద్య పానీయం పుచ్చుకునేందుకు లైసెన్సు; అంతటి ఉద్యోగం.

ఈ కథకోసం అతన్ని స్నేహితుడుగా చెప్పాలన్నా, అదో రక మైన స్నేహం. అతను ఏ బొంబాయో వెడుతుంటే ఏ ఫస్టుక్లాస్‌లోనో పేపర్ చదువుతూ కూర్చుండగానో ఓ చిన్ని చూపు, కుశల ప్రశ్న—గార్డు విజిల్—రైలు కదలడం. వాళ్ళ యింట్లో శుభకార్యం జరిగితే, ఒక ఆహ్వానపత్రం రావడం, నేను సమయానికి డబ్బుంటే శుభాకాంక్షలు పంపడం. అంతే, మా స్నేహం.

వారి సంస్థకి ఆ యేడు పెద్ద లాభా లొచ్చాయట. ఏదో వినోదం జరుపుకుంటున్నారు. నాదో నాటిక ఆడడానికి అతని సలహాపై నిశ్చ యించి నాకు వ్రాశారు. నా నాటికలు ఆడేవాళ్ళు ఎవ్వరూ లేరు. వీళ్ళు ఆడడానికి నిశ్చయించారంటే, వీరి అభిరుచి, సంస్కృతుల పట్ల శంకలు రాసాగినా, వాటిని దిగమింగేసి, నాటకం రేపనగా—యివాళ సాయంత్రా నికి ఆ ఊరు చేరుకున్నాను. స్టేషన్‌కి కాంతారావు రాలేదు కాని, కారు పంపించాడు. నన్ను, సామాను ఓ పెద్దగదిలో దింపారు; ఒక నౌకరు

అన్నీ కనుక్కుంటున్నాడు. టిఫెన్, స్నానం, అలంకారం అన్నీ అయ్యాయి. తోటలో పచార్లు చేస్తున్నాను.

"అయ్యగారు సాయంత్రం ఏడుగంటలకి వస్తారండి. మిమ్మల్ని యిక్కడే సిద్ధంగా ఉండమన్నారండి" అన్నాడు నౌకరు.

"అమ్మగారేరీ ?"

"సిమ్లా వెళ్ళారండి"

సిమ్లా ఎందుకో! నేనెప్పుడైనా హిమాలయ పర్వత ప్రాంతానికి వెడతానా ? ఆ మంచుకొండలు, ఆ విశాలమైన ఒంపుల బయళ్ళు, ఆప్యాయతకి కరిగి యువక హృదయంలా సూర్యరశ్మికి విడిన పుష్పాలు. జారిన సెలయేళ్ళు, వృద్ధుని ఒంటి పన్నులా, తీగని పట్టుకున్న ద్రాక్ష గుత్తులు—పుస్తకాల్లో, సినిమాల్లో చూసిన హిమాలయ పర్వత దృశ్యాలను వెనకటిజన్మలో జ్ఞాపకాలలా స్మరించుకుంటూ ఉండగా ఏడైంది. దూరంగా కారాగిన చప్పుడైంది. అయ్యగారొచ్చారంటూ ఇద్దరు నౌకర్లు తోటమాలి హడావుడిగా నడుస్తున్నారు. కాంతారా వొచ్చాడు. రెండు మూడు కుర్చీలు చెట్ల మధ్య వేశారు. ఓ బల్లమీద కూల్‌డ్రింక్స్ పెట్టారు.

"శ్రీనివాస్ యివాళ టైమ్‌కొచ్చినట్లుందే ? ఇక్కడ బాగుందా, స్నానం, టిఫిన్ ?"

"ఓ చాలా బాగుంది"

"షవర్ బాత్ చేశావా ?"

"అదేదో అట్లాంటిదే అనుకున్నాను. అదీ యిదీ తిప్పి చూశాను. నీళ్లు మాత్రం రాలేదు" అన్నాను.

"కొత్త మోడల్‌ది. మొన్ననే బిగించారు. హాండిల్ పైకి తీసి, హుక్‌లో బిగించాలి. అయినా నువ్వు కవివి. నీ కేవన్నా అర్థమవుతాయా ?" అంటూ కాంతారావు నవ్వడం సాగించాడు.

సంఘంలో పైకొచ్చిన ప్రతి వ్యక్తి వీలు చిక్కినప్పుడల్లా కవుల

మీద ఛలోక్తులు విసరడం కొత్త కాదు. అయినా నేను కవిని గాను. ఏ రచన చేసినా సరే ఆ వ్యక్తిని "కవీశ్వరుడు"గా వ్యవహరించే సంప్రదాయం ఇంకా పోలేదు కాబోలునని లోపల అనుకున్నాను.

"ఆమె సిమ్లా వెళ్ళారుట" అన్నాను.

"మా డైరెక్టర్ కీ దొరలే. ఆయన భార్య పుట్టినరోజు సిమ్లాలో జరుపుకుంటూందిట. నా కెల్లానూ తీరదు గనక ఆమే, అబ్బాయీ వెళ్ళారు. స్త్రీల పుట్టినరోజు పార్టీలకి మొగాళ్ళు వెళ్ళకూడదు. వారి పుట్టినరోజు జ్ఞాపకం ఉంచుకుని వయస్సుని మాత్రం మర్చిపోవాలి. ఇది మొగాడికి సాధ్యం కాదేమో" అన్నాడు కాంతారావు. ఇద్దరం నవ్వుకున్నాం.

"రిహార్సల్స్ సాగుతున్నాయా ?" అని అడిగాను.

"ఏం రిహార్సల్స్ ?"

"అదే, రేపటి నాటకం తాలూకు..."

"ఓ, అదా! నీ నాటకమా! రేపటి మాట కదా. చూద్దాంలే" అన్నాడు.

అంత పెద్ద అధికారిని రిహార్సల్స్‌లాంటి స్వల్ప విషయం గూర్చి అడగడం పొరపాటని గ్రహించి, పెదవి కొరుక్కున్నాను అతను చూడకుండా.

"నువ్వొస్తున్నావని తెలిసి, కొందరు స్నేహితుల్ని పిలిచాను. చిన్న పార్టీలాంటిది జరుపుదాం. ఏం ?"

"ఎవర్ని ?"

"నువ్వెవర్నీ ఎరగవేమో. దీనదయాళ్ అని మా సంస్థ వినోదాల కార్యదర్శి; డాక్టర్ హరికృష్ణ, ఇక్కడ డాక్టర్. అతనే సంక్షేమాధికారి కూడా; అతని భార్య "వసుధమయి"-అందరం 'సుధా' అంటాం; సూపరిండెంటు శ్రీనివాసులు; అతను రానని కబురంపాడు; మనం; అంతే. "సుధ"ని చూసి గాభరాపడకేం ?" అని కొంటెగా చూసి నవ్వాడు.

"ఏం కథ ?"

"నువ్వే చూస్తావుగా. విపరీతంగా తాగేస్తుంది. శృంగార చేష్టలు సాగిస్తుంది. అన్నట్లు నువ్వు కవివిగా, కాస్తంత రుచి చూస్తావుగా, శృంగార చేష్టల్ని కాదు సుమా!' అన్నాడు. రచయితకి అన్నిరకాల అనుభవాలు కావాలి. ఈ అవకాశం పోగొట్టుకోవాలని లేదు. ఇట్లా వదిలేసుకున్న అవకాశాలను స్మరించుకుని తరవాత పశ్చాత్తాపపడటం జరుగుతుందనినాకు అనుభవమే.

కాంతారావుకేసి పరీక్షగా చూశాను. వెంటనే అతనిలో కనబడేది ఎత్తైన విగ్రహం. ఎత్తైయినవార్నేగాని చెప్పుకోదగ్గ వ్యక్తులుగా చూడరు పాశ్చాత్యులు. అసలది చూసే ఈ ఉద్యోగం ఇచ్చారేమోకూడా! పొట్టి నిక్కరు, సాక్సు, కాన్వాస్ షోళ్ళు, బెల్టు, మణికట్టంతా ఆక్రమించిన రిస్టు వాచి, చదరంగా మెలికలుతిరిగిన కండలు కనిపించే-బుజాలు, మెడ, వంకీలు తిరిగి పైకిదువ్విన పల్చటి క్రాప్, కళ్ళకింద కోణంగా తేలిన చెంప ఎముకమీద బిగిసిన చర్మం, క్రమం తప్పిన ఒకటి రెండు మినహా- వరుసగా స్ఫుటంగా వున్న పళ్ళు, విరగబడి నవ్వినప్పుడు చిగుళ్ళు ఎర్రగా కనిపించి, సంధ్యాసమయంలో మేఘాల చివర అలుముకున్న ఎరుపులా- ఈ కథ కాంతారావును గూర్చి కాదు గనుక, నే నతన్ని వర్ణించను.

స్నానంచేసి వస్తానని లోపలి కెళ్ళాడు. నేను లేచి మొక్కల మధ్య పచార్లు చేస్తున్నాను. స్వేచ్ఛగా ప్రకృతిలో వాటంతటఅవి పెరిగిన చెట్లని, మొక్కలని చూసి ఆనందించినట్లుగా, మనిషి సృష్టించిన తోటని చూసి ఆనందించలేను.

మనిషి వేసిన తోటలో క్రమం, వో వరుస, వైవిధ్యం వుంటాయి నిజమే. తాత్కాలికమైన ఆహ్లాదాన్ని కలుగజేస్తాయి ఈ తోటలు. ఇంద్రియాల వత్తిడిపై వాటి అరాజకమైన చీకటినీడల శక్తితో విప్లవంచేసి, ఓడించి, పవ్వళింపజేసి, నిశ్చలమైన వైరాగ్యాన్ని ఇవ్వవేమో, మనిషి

వేసినతోటలు! నే స్వంతంగా వేసుకున్న తోట అంతటి ఆనందాన్ని కలుగ చేస్తుందేమో నా కింకా అనుభవంలేదు.

గేటు చప్పుడైంది. చప్పుడుచేస్తూ ఇద్దరువ్యక్తులు నా ముందుగా నడిచి, వరండాలో కుర్చీలమీద చతికిల పడ్డారు. ఒకాయన ఎత్తుగా సన్నంగావున్నాడు. మరోఆయన పొట్టిగా, లావుగా వున్నాడు. లావా టాయన మాటలు లేని పాట బిగ్గరగా పాడటం సాగించాడు. నా కేసి చూసి నిల్చిపోయాడు.

"మీరేనా వచ్చింది మధ్యాహ్నం?"

"అవునండీ"

"కాంతంగా రొచ్చి చాలా సేపై వుండాలి. లోప లేం చేస్తున్నాడు? భార్య వూళ్ళో లేదుగా" అని నవ్వుతున్నాడు.

"స్నానం చేస్తున్నాడు" అన్నాను.

"పరిచయం చేసుకుందాం పట్టండి, స్పృహలో వున్నప్పుడే. ఈయన దీనదయాళ్, మా క్లబ్ సెక్రటరీ. నేనేమో డాక్టర్ హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణహరే అనే ప్రార్థనుంది చూశారూ! అది-అంటే పేషంట్లు ఆ విధంగా తమవద్దనుండి వెళ్ళిపోమ్మని ప్రార్థిస్తూంటారన్న మాట!"

దీపంవెలుగులో ఆయన్ని పరిశీలించాను. ఎర్రగా, కందగడ్డలా వున్నాడు. నెత్తిన వెంట్రుకలు అక్కడక్కడ వుండికూడా, ఏమీ లేనట్లుగా, చదునుగా వుంది బుర్ర. కళ్ళకింద అర్ధచంద్రాకారంలో ముడతలు, గడ్డంకింద సృష్టికి ప్రతిసృష్టిలా మరోగడ్డం, శరీరంలో కండలు పట్టుజారి, స్వేచ్ఛగా వింతవింత ఆకృతులలో దిగజారి ఏ భాగం ఎక్కడ ప్రారంభమై, ఎక్కడ అంతం అవుతుందో తెలీకుండా, సర్రీలిస్ట్ చిత్రంలా తయారైంది ఆయన శరీరం.

సెక్రటరీని, నాటకం రిహార్సల్సు గురించి అడుగుదామని గొంతు సవరించుకుని వాక్యనిర్మాణం చేస్తుండగా కాంతారా వచ్చాడు.

నౌకర్లు కుర్చీలూ, బల్లలూ తోట మధ్యగా అమర్చారు. ఆ ముగ్గురూ

ఏవో పాడుకుంటూ, మాట్లాడుతూ, నవ్వుకుంటూ, కుర్చీలదగ్గర కొచ్చారు. నన్ను రమ్మన్నారు.

"ఈయనదే రేపటి నాటకం" అని కాంతారావు నన్ను పరిచయం చేశాడు.

"చాలా బాగుందండి"

"మీరు చదివారా?"

అదికాదు, మిమ్మల్ని కలుసుకోవడం అన్నాడు హరికృష్ణ.

చదవడం ఎందుకు? రేపు చూస్తున్నాంగా. అన్నట్లు, రేపురాత్రి కార్యక్రమం ఏమిటి దయాళ్?"

"చూశాలి. సాయంత్రం ఫొటో, పార్టీ. ఆ తర్వాత లాజరస్‌గారి ఉపన్యాసం. తరువాతది మన అప్పటిపరిస్థితినిబట్టి వుంటుంది, కుర్చీల్లో కూర్చునే చైతన్యం వుంటే." హరికృష్ణ సంగీతంలో వాక్యం పూర్తవలేదు. నౌకర్లు గబగబ గ్లాసులు, ప్లేట్లు బల్లమీద అమరుస్తున్నారు. నేనీలోగా గొంతుసవరించుకొని నాటకం ఎంతవరకూ తయారైందో అడగాలని నిశ్చయించుకున్నా.

"అవుతే మీరు కవులన్నమాట! మాకు ఈ కవిత్వాలతో కుదరదండి. మన వృత్తేమిటి బ్రదర్! డాక్టర్‌గా పిల్లల్ని పుట్టించడం—కాంతారావు పనివాళ్ళని పెంచడం – చివరలో నేనే వారిని చంపెయ్యడం, ఈ లోగా ఆ పని కాస్తా మా సుధానైటింగేల్ చెయ్యకుండావిడిచిపెడితే! హా, హా హ, హ" అని మొదలెట్టిన నవ్వుని పాటలో దించేశాడు. నౌకరు గ్లాసుల్లో ఐస్‌వుంచి, సోడాలుకొట్టి పోశాడు. రెండు పెద్దసీసాలు రిఫ్రీజిరేటర్ లోంచి తీశాడు. కాంతారావు మూతలుతీసి ద్రావకం గ్లాసుల్లో సర్దాడు. నాచేతుల్లో ఓ గ్లాసు పెట్టాడు.

నాకు భయమేసింది. దగ్గరదగ్గరగా అంగుగెత్తు గ్లాసు నాకు కొత్త

ఏమవుతుందో! ముందు వాళ్ళ కేమౌతుందో చూసి తరవాత ఉపక్రమిద్దా మనుకుని తటపటాయిస్తున్నాను.

"మీ కలవాటు లేదా?" అన్నాడు దీనదయాళ్.

"మా వాడికి కొత్త"

"అది ఒట్టిమాట. ప్రతివ్యక్తీ త్రాగుడు అలవాటుతోనే పుడతాడు. ఆముదం, పాలతో ప్రారంభం. సృష్టికర్త గొప్ప త్రాగుబోతు. లీల, కేళి, విహారం, తాండవం. ఏదో పద్యంకూడా వుంది—నాకురాదు కాని, ఇవన్నీ త్రాగుడు లేని వారికి సాధ్యంకావు. దేవతలు సురాపానం, అమరులు సోమపానం, దైత్యులుమాటకి అర్థం తెలీదనుకోండి. ఏదో అనేకానుకరమ్. ప్రతివాడూ ఓ దానికోసం పుట్టాడు. దీనదయాళ్‌ని చూడండి; విస్కీవాలా; నా బ్రతుక్కింత బ్రాందీచాలును; కాంతారావు జిన్ తప్ప మరోటి ముట్టడు. ముఖ్యంగా ఆదివారం నర్సు సుధానైటింగేలుకోసం షాంపేన్ కనుక్కున్నారు పాశ్చాత్యులు. కాని, ఆమె దాన్ని ముట్టదు." ఆ ముగ్గురూ గ్లాసులు తగుల్చుకొని, నా గ్లాసుకి తగిల్చి, పుచ్చుకుంటున్నారు.

"ఊ—కానీ" అన్నాడు కాంతారావు.

"కాసేపుండి" అన్నాను.

"దానికో ముహూర్తం కూడానా ?"

"పోనీ కాసేపాగండి. మా ఆవిడ వస్తూ వుంటుంది. ఆవిడకి తోడుందురుగాని" అన్నాడు హరికృష్ణ.

"ఆమె యింకా రాలేదేం ?"

"డ్రెస్ చేసుకోవద్దూ ! డ్రెస్ వుండడంవల్ల కవులు కనుక మీకు తెలుస్తుంది. కొన్ని లాభాలున్నాయి. నగ్నంగా వుంటే ఎంత బాగుంటారో వూహించుకోవచ్చు. అందులో ఆనందం లేదంటావా ?" అన్నాడు డాక్టర్.

ఉంది కళలలో బాగా కనబడుతుంది. ఆధునిక శిల్పంలో "టార్ ప్రధానమైంది. శిల్పానికి తలుండదు — కాళ్ళుండవు. చిత్రలేఖ

నంలో సగంజారిన పమిట, సాహిత్యంలో వర్ణించక విడిచిపెట్టిన కొంటె చేష్ట — యివి రసానుభూతికి ఆయువుపట్లు - నగ్న సత్యం అన్నారు. సభ్యత అనే ఓ తెర వుంటుంది కళలో కూడా ఆ తెరని పూర్తిగా తొలగించడానికి వీల్లేదు అన్నాను.

చెప్పడానికి ధైర్యం చాలక తొక్కిపెట్టేసిన వుద్రేకాల తీవ్రత యీ అవకాశం చిక్కించుకుని నా చేత యీ వుపన్యాసం చెప్పించి వుంటుంది. లేకపోతే నేనెందుకు అంత తీవ్రంగా చెప్పడం ? — దానికి అర్థం వుందా ? అర్థం తగ్గిన కొద్దీ, వుద్రేకం హెచ్చుతూంటుంది కాబోలు. డాక్టరు నే చెప్పింది చాలా బాగుందన్నాడు. తనకి బోధపడలేదు గనుక అందులో ఏదో నిజం ఉండాలన్నాడు కాంతారావు. 'ఆదర్శం కోసం దేన్నైనా త్యాగం చెయ్యడానికి సిద్ధపడతాం, ఎటొచ్చీ ఆ ఆదర్శం స్పష్టముగా వుండకూడదని ఎవరో అన్నా'రన్నాడు దీనదయాళ్. నా గ్లాసులో ఐస్ కరిగింది. వొక్క గుటకేశాను. అంతా నాకేసి చూశారు. అంతా నిశ్శబ్దంగా వుంది. చక్కిలిగింతలు పెట్టి కదిపినట్లుగా, నిశ్శబ్దం లోంచి తన్నుకులాడి బైటపడింది, వో స్త్రీ కంఠం లోంచి నవ్వు. ఆ నవ్వు వెనక వూగిసలాడుతూ సుధామయి.

"మాటా పలుకూ లేకుండా యింత నిశ్శబ్దంగా వున్నారేం — డాక్టరు గారు ఛలోక్తులాడి నవ్వించాలని ..."

నావంక చూసి ఆగింది. కాంతారావు నన్ను ఫలానా అని పరిచయము చేశాడు. "గ్రంథకర్త గారా ! ఈ తరం వాళ్ళనే కాకుండా ముందుతరాల వాళ్ళని కూడా విసిగించేవాడు గ్రంథకర్త - అని ఎవరో అన్నారు" అంది.

"అప్పుడప్పుడు ఏకాంకికలు వ్రాస్తూ —"

నా వాక్యం పూర్తవకుండానే ఆవిడ మొదలెట్టింది.

"ఏకాంకిక అంటే ఒకసారి తెరలేచి చివరలో తెరపడుతుంది — అంతేనా ?"

ఏకాంకిక స్వరూపం గూర్చి నాకున్న అభిప్రాయాలు చెప్ప డానికి వాక్యాలు నిర్మాణం చేసుకుంటున్నాను. మళ్ళా ఆవిడే అంది.

"మీకు పిల్లలున్నారా ?"

"అదేం ప్రశ్న ? ముందు వివాహమైందేమో కనుక్కోకుండా?" అన్నాడు హరికృష్ణ.

"పెండ్లికాకపోతే పిల్లలు పుట్టరా ఏం ?" అన్న దామె.

"పెండ్లయితేనే పుట్టడం లేదే ఈ రోజుల్లో ?" అన్నాడు భర్త.

"అందుకనే మీతో బైటకి రానంటాను" అని లేచి తోటలోకి నడిచింది.

"కోపం వచ్చేసింది భాయీ – అలక తీర్చడం మీ వొంతు" అన్నాడు భర్త. కాంతారావు నన్ను లేవదీశాడు. ఇద్దరం తోటలోకి వెళ్ళాం. కాంతారావు ఆమెని బ్రతిమిలాడాడు, లోపలికి రమ్మని. మొక్క ల్లోంచి వింత పరిమళం, నీళ్ళకి తడిసిన మట్టి వాసనతో కలసి ఆవరిం చింది నక్షత్రాలు స్ఫుటంగా మెరుస్తున్నాయి. పరిమళం వాటివద్ద నుండి వస్తున్నట్లు. బురద నీళ్ళలో మసకగా మెదిలిన చంద్రబింబం నీడలో ఆమె ముఖం వెల వెల పోయింది. నీళ్ళు నిశ్చలంగా వున్నాయి. చంద్రబింబం నీడ కదలడం లేదు.

"గ్లాస్‌లో ఐస్ వేడెక్కుతుంది. లోపలికి రండి" అన్నాడు కాంతా రావు.

హరికృష్ణ కూడా వచ్చాడు. ఆమె నడుంచుట్టూ చేతులు బిగించి, పైకి లేవదీసి లోపలికి తీసుకొస్తున్నాడు. కాంతారావుని కూడా ఒక చెయ్యి వెయ్యమన్నాడు. ఇద్దరూ వరండాలోకి చేరేశారు.

"ఇంటి దగ్గర ఒక డోసు అయిందా ?" అన్నాడు డాక్టరు హరి కృష్ణ.

"చూడు కాంతారావు – ఆ మాధవమ్మ కొడుకు చావు బ్రతుకుల మీదున్నాడు. వాడి విషయం కనుక్కోకుండా, యిల్లా వచ్చేస్తే వాడేం

గాను ? నేవెళ్ళి డాక్టర్ వెంకటరెడ్డిని తీసుకొచ్చి యిలా వచ్చాను.
"భర్తకి కోపం వచ్చింది. ఆ కాలనీ డాక్టర్ సంక్షేమాధికారి తనుండగా, బైట డాక్టర్ని తీసుకొచ్చే అధికారం తనకేముంది ?

ఈ అక్రమానికి చర్య తీసుకోమన్నాడు కాంతారావుని.

"పిల్లల విషయం ప్రతి సంభాషణలోనూ దించడం దేనికి ? ఆయన పెండ్లి సంగతి నీ కెందుకు ? అది మర్యాదా ?" అని హరికృష్ణ నా వైపు చూపాడు.

"ఫరవాలేదు. దానికేం లెండి – అందులో తప్పేముంది ?" అన్నాడు ఏదో సర్దుబాటు చేస్తూ.

"ఎందు కడిగానంటే, పిల్లలు గలవాళ్ళు నాటకాలు వ్రాస్తారు. లేని వాళ్ళు నాటకాలాడతారు. మనం చేస్తున్నదే అది – నాటకాలాడడం — మీ గ్లాసింకా అల్లాగే వుందేం —" అన్నదామె నాకేసి చూసి.

"నీతోపాటు పుచ్చుకుందామని" అన్నాడు కాంతారావు.

"ఎంత మంచి గ్రంథకర్తండీ మీరు ! అవుతే ప్రారంభించండి" అని ఆమె త్రాగటం మొదలెట్టింది. నేనూ, అటూ యిటూ చూసి, ఒక్క గుక్కలో గ్లాసులోదంతా పుచ్చేసుకున్నాను. ఆ ముగ్గురూ ఆశ్చర్య పడ్డారు. అల్లా పుచ్చుకోకూడ దన్నారు. "నాకు తెలియదు. క్షమించండి" అన్నాను.

"కొందరికి అట్లా పుచ్చుకుంటేగాని, పుచ్చుకున్నట్లు వుండదు." అంటూ సుధామయి గ్లాసులోదంతా తాగేసింది.

హరికృష్ణ నిర్విణ్ణుడయ్యాడు. ఆమె చేతుల్లో నుండి గ్లాసు తీసే శాడు. భర్త ముందున్న గ్లాసులో సగం కూడా వక్క గుక్కలో త్రాగే సింది.

"ఎల్లావుంది ?" అనడిగాడు కాంతారావు.

"వగరుగా వుంది, నా కేమీ రుచిగా లేదు. ఇందులో మజా ఏమిటో తెలియడం లేదు" అన్నాను.

మరి సోడా గ్లాసు ఒంపాడు.

దీనదయాళ్ – "ఎవరికీ కొత్త, అల్లా పొయ్యొద్దు" తను పోసుకుంటూ.

"ఇదొద్దు – ఏంటేదేనా తియ్యటిది ఇవ్వండి" అన్నాను.

'ఓ, ఆడవాళ్ళు కావాలన్న మాట. ఆస్ట్రేలియన్ "ఏమో" వైన్ బాగుంటుంది" అంటూ కాంతారావు, తెల్లపెట్టిలోంచి వైన్ బుడ్డి తీసి, చిన్నగ్లాసులో కొద్దిగా పోశాడు.

"మీకీ వైన్ ఎక్కడిది?"

"మొన్న జాక్సన్ దొర పార్టీకి తెచ్చాడు."

సుధామయి, నా గ్లాసు తీసుకుని తాగేసింది. ముగ్గురూ నవ్వడము సాగించారు. కాంతారావు ఓ లెక్చరిచ్చాడు. నాలుగైదు రకాలు ఒకేసారి పుచ్చుకోకూడ దన్నాడ. మెల్లి మెల్లిగా తాగాలన్నాడు. నౌకరు ఆమ్లెట్లు, రొట్టెలు తెచ్చాడు. ఈ పూటకి చాలు నన్నాను అది ఎటికెట్ కాదన్నారు. మళ్ళా నా గ్లాసులో కొద్దిగా వైన్ పోశారు. కాస్తంత పంచదార వెయ్యమన్నాను. గొల్లుమని నవ్వారు. దీనదయాళ్ తూలి కుర్చీ మీదనుంచి పడిపోయ్యాడు. అతన్ని సుధామయి, డాక్టర్ కలిసి లేవదీశారు.

"నాలుగైదు రకాలు తాగడం గూర్చి ఓ కథ చెప్పనా ? ఈయన లాగే ఒకాయన ఒక రోజున జిన్‌లో సోడా కలిపి తీసుకున్నాడు. మత్తు చేసింది. మర్నాడు, విస్కీలో సోడా కలిపి తీసుకున్నాడు, మరీ మత్తు చేసింది. ఆ తరువాత మరో రోజున బ్రాందీలో సోడాకలిపి తాగాడు. మత్తెక్కింది. రమ్‌లో సోడా కలిపి తీసుకున్నాడు. మళ్ళా మైకం కమ్మేసింది. ఆఖరికి ఓ నిర్ణయాని కొచ్చాడు–మత్తుకి కారణం సోడా అని"

అందరూ నవ్వడం సాగించారు. సుధామయి పళ్ళు ఎంతో అందంగా వుంటాయనీ, అందుకనే ఆమె అస్తమానూ నవ్వుతూ వుంటుం దని అప్పుడు తెలుసుకున్నాను. వారు కబుర్లు చెప్పుకుంటున్నారు. దీన

దయాళ్ కొడుకుని ఇంగ్లండు పంపుదామా, అమెరికా పంపుదామా ? కాంతారావు కూతురికి నృత్యం ఎక్కడ, ఎవరి దగ్గర చెప్పించాలి ? వచ్చేనెల కంపెనీ మీటింగు అస్సాంలో జరుగుతుందిట. ఏర్ కండిషన్డు కోచ్‌లోనా, విమానంలోనా ప్రయాణం? దీనదయాళ్‌కి రెండు వేలు చేబదులు కావాలి, ఎవరిస్తారు! కాంతారావుకు నాలుగు వేలు కావాలి, ఎవరిస్తారు ? హరికృష్ణ మొన్ననే రాఘవకి రెండు వేలు ఇచ్చాడు తన దగ్గరేం లేదు. మరి సుధా ఏమన్నా విడిగా దాచినదాంట్లో సర్దగలదేమో, స్పృహలో వున్నప్పుడే అడిగి తెలుసుకోడం మంచిదన్నారు.

నేను వారి జీవిత విధానాన్ని, మనస్తత్వాలనీ పరిశీలిస్తూన్న దాన్ని బట్టి శరీరంలో వచ్చిన మార్పులని వూహిస్తూ చూస్తున్నాను. దీన దయాళ్ తప్ప వారంతా నడివయస్కులు. సుధ వయస్సు ముప్ఫై అయిదు లోపు. దగ్గరగా పరిశీలించడానికి అలవాటుపడితే గాని ఆమె చక్కదనంలో ప్రత్యేకత అర్థం కాదు. ఎంత ఎరుపు కాదు. చామన చాయకంటే మరొక్క చాయ. కోల మొహం, చిన్నముక్కు, స్వేచ్ఛగా నవ్వేయడానికి అలవాటుపడ్డ నోరు, గడ్డం కింద చిన్ని నొక్కు, పటుత్వం సన్నగిల్లని శరీరం, నడుం, రొమ్ములు, పిరుదులు వేటికవి తీర్చిదిద్దినట్లు చీరని పాయలుగా చీర్చి, పడవలసిన చోటనే మడతలు పడుతూ, చిత్రకారుడికీ నగ్న ప్రతిమల శిల్పికి కూడా తృప్తినిచ్చే ఆకృతి ఆమెది! ఆకుపచ్చ రంగు షిఫాన్ చీరలోంచి నల్లబోర్డర్ గల జాకెట్ గుండ్రంగా మెడచుట్టూ బరువుగా సూర్యకిరణాల నెక్‌లెసు, "స్వస్తికాలో" డైమండ్స్ అమర్చిన దుద్దూలూ, పాపిటలో కుంకుమ - అదీ ఆమె విగ్రహము తీరువు. చూడగానే చటుక్కున కనబడే ప్రత్యేకత ఆమె జుట్టు-పొడుగాటి ఎత్తైన తలకట్టు, జడ అందులోంచి మొహం చిన్నదిగా కన బడుతుంది. అంతా వుంగరాలు తిరిగి మెడ దగ్గర, చెంపల మీద, పాపిటముందూ పొదల్లే అల్లుకుపోయున్న వెంట్రుకలు. పాపిట రెండు వెంపులా కూనె వేసినట్లు ముందు వెంట్రుకల నీడలు నుదుటి మీద కదు

లుతూ, చూపుని తమవైపు తిప్పుకుని నిలిపి వేస్తాయి. ఆ నుదుటిమీదే కుడికన్ను బొమ్మపైన అరంగుళం గాయం మచ్చ.

"మీకు చిన్నప్పుడు దెబ్బ తగిలిందా?" అని అడిగాను, నా ఆలోచనలని పైకి తెలియబరుస్తూ.

వారి సంభాషణ నిలిచిపోయింది.

"చెప్పు" అన్నాడు హరికృష్ణ.

"మీరే చెప్పండి" అన్న దామె.

"నేను చెబుతాపట్టండి" అన్నాడు కాంతారావు. ఇల్లా చెప్పాడు.

"నిరుడు కాబోలు—నెల చివర ఏదో సమ్మె జరిగింది. కంపెనీలో జీతాలు ఆలస్యమన్నారు. సరుకు సమయానికి రావడం లేదు. ఆ రాత్రి సీసాల సరుకు కావలసి వచ్చింది. ఎవడో ఏజంటు వచ్చాడు. డబ్బిస్తే కాని, క్రెడిట్ యివ్వనన్నాడు. డబ్బు లేదు సుధని అడిగాం. తన స్వంతం కానీ కూడా లేదంది. ఆరాతీయగా, స్త్రీల సంక్షేమ శాఖ తాలూకు కంపెనీ ఫండు కొంత వున్నట్లు తేలింది. మళ్ళా యిచ్చి వేస్తాం యిమ్మన్నాం. ఇవ్వనంది. వెదికి తాళములు తీశాం. అటకా యించింది. ప్రజల సొమ్ము తీయడానికి వీల్లేదంది. హరికృష్ణకి ఒళ్ళు మండింది. బలవంతంగా పెట్టె తియ్యబొయ్యాడు. వారించింది. ఇద్దరూ పెనుగులాడారు. అతన్ని తోసింది. వెళ్ళి కిటికీ మీద పడ్డాడు. మరీ కోపం వచ్చేసింది. ఆమెని ఒక్క తోపుతోశాడు. వెళ్ళి మంచంకోడు మీద పడింది. అదీ, ఆ దెబ్బ."

నేనాశ్చర్య పడ్డాను. ఆమెపట్ల గౌరవ భావం ప్రబలింది. కుతూహలం కూడా పెరిగింది.

"నే నేదో ఘనకార్యం చేశాననుకోడం లేదు. ఎవరు తాగి తందనాలాడినా నా కభ్యంతరంలేదు. ప్రతివాడు తనకు నచ్చిన విధంగా సంతోషించాలి. ఏ కాలక్షేపమూ లేని యిక్కడ యీ వుద్యోగాల్లో డబ్బుకి దొరికే ఆనందం, త్రాగుడు నాకూ యిష్టమే. అలవాటు చేశారు ...

తప్పదు. కాని దానికోసం ప్రజలసొమ్ము ఖర్చుపెడదామంటే నే నొప్పు కోను—అప్పుడూ యిప్పుడూ కూడా. ఆ బుద్ధి యిల్లాతే" అని ఆమె తన గ్లాసులో సీసా వంచుకుని మెల్లగా చప్పరిస్తోంది. వారు నలుగురూ తింటూ త్రాగుతూ కబుర్లు చెప్పుకుంటూ కాలం గడిపేశారు. తొమ్మిది దాటు తోంది.

"ఇంతకీ మీ నాటకం దేన్ని గురించి ?" అని అడిగాడు దీన దయాళ్.

"మీరు చూశ్శారా ?"

"ఏదీ—యింకా—రేపు చూద్దాం."

"చదవలేదా ?"

"మాకెక్కడ తీరుతుందండి—చదివినా అర్థంకూడా కాదు. స్త్రీ పాత్రలున్నయ్యా...?"

"స్త్రీలు, పురుషులు లేకుండా నాటకమేలేదుగా" అన్నాను.

"బృందకి వో వేషం యివ్వలేకపొయ్యారా ?" అన్నాడు కాంతారావ్.

"ఏదో ఏర్పాట్లు చేసే వుంటారు" అన్నాడు దీనదయాళ్.

"మీ నాటకం గురించి చెప్పండి" అన్నది సుధ.

గొంతు సవరించుకొని మొదలెట్టాను.

"అసలు ప్రేమించడం, ప్రేమించడం అనే అనుభవాన్ని ప్రేమించడం—యీ రెంటికీ వున్న తేడా చూపాలని యీ నాటికలో వొక యత్నం జరిగింది."

సుధా, భర్త ఒకరికేసి ఒకరు చూసుకున్నారు ఆ నవ్వులో భవి ష్యత్తు వున్నట్లు స్ఫురించింది. హరికృష్ణ సంగీతం ప్రారంభించాడు. దీనదయాళ్ పైస్థాయిలో అతనితో కలిసి పాడేయత్నం చేస్తున్నాడు. కాంతారావ్ కూడా, అదోలాఅయి, పరధ్యాన్నంలో వున్నట్లుంది.

"కథ చెప్పు చంపక" అన్నాడు.

మాటలు బరువుగా రాసాగాయి.

స్పష్టత సన్నగిల్లింది. నేను తటపటాయించాను. మొదలెట్టి చూద్దాం అని ఉపక్రమించాను.

"ఒకామెవుంది. ఆమె భర్త వున్నాడు. భర్తంటూ లేకపోతే, మన ప్రియురాండ్రని పోషించేదెవరు...?..."

ఒక్కసారిగా సుధ నవ్వింది. పొడుగ్గా, సంగీతం పాడినట్లుగా, అతిశయోక్తిగా నవ్వింది. ఆమెను చూసి హరికృష్ణ నవ్వడం, దీనదయాళ్ కూడా నవ్వుతున్నాడు. ఓక్షణం నిదానించి, మోటారు సైకిల్ టైర్ బద్దలైనట్లూ, కుంటి భోషాణం ఎత్తునుండి పడినట్లూ, కాంతారావు నవ్వాడు.

నా కర్థంకాలేదు. అసహాయత కోపంలోకి మారింది. అరసికుని ముందు పాండిత్య ప్రకర్షంచేయిదే కాబోలునను కున్నాను. ఆ గ్లాసులన్నీ పగలగొట్టాలనీ, వాళ్ళ మొహాన పళ్ళాలు విసిరెయ్యాలనీ, సుధ మెడలో సూర్యకిరణాల నెక్లెస్ బలాత్కారంగా వూడదీసి, గిరవాటెట్టాలనీ, ఏవేవో సినిమాలో 'విలన్' చేసే భీభత్సమైన చేష్టలను ప్రేరేపించే ఆలోచనలొచ్చాయి. ఆ నవ్వు నిలిపి, వూపిరి బాగా పీల్చి, కన్ను మెదిపి, మళ్ళా మరోస్థాయిలో నవ్వు సాగించింది. ఆ నలుగురూ కన్ను మెదపడం, ఓ ఆటగా ప్రారంభించారు. నాకేసి చూస్తూ కన్ను మెదపడం మొదలెట్టారు. ఆ దృశ్యానికి నా కోపం జాలిగ్గా మారింది. వారి శరీరాలు యంత్రాలు. వాటిపై వారికి స్వాధీనంలేదు. కోపానికి చలించే చైతన్యం వారిలో లేందే కోపగించి ప్రయోజనం? తుఫానుకి సముద్రంలో కెరటం గిలగిలతన్నుకుంటుంది. దానిలోతు దానికేం తెలుసు? నా వుపమానా లెవరికా్కవాలి? వారిముందు నే నెవర్ని? అసలు అందరం ఎవరం? ఆ క్షణంలో అందరం ఒక్కటిగా ఐక్యతపొంది, సృష్టిలో "వునికి"కి

నిదర్శనంగా తయారవకూడదా? 'అహం'లోంచి బైటపడి గెంతి, నగ్నంగా ఆ నవ్వులో కలిసిపోగూడదూ? అప్రయత్నంగా నేనూ ఒక్కసారి నవ్వే శాను. నన్ను చూసి వారందరూ మిగిలిన ఓపికతో జలవిద్యుత్ లాంటి కన్నీటిని మొహం అంతా వ్యాపింపచేసి, మరొక్క కడసారి లయతో శరీరాలు పగలకుండా చేతులతో అదిమిపట్టి, సుదీర్ఘమైననవ్వుని సృష్టించి, ఆనందవాహినిలో కలిసి అందరం ఒకటైపోయినాము.

ఇంక తరువాత జరిగినవాటిని గురించి చెప్పను. త్రాగి మైమరచిన వ్యక్తులను జీవితంలో హర్షించను; అట్లాంటి వారిని చిత్రించే కథలన్నా, నాటికలన్నా, నవలలన్నా, సినిమాలన్నా నాకు తలనొప్పి. ఆ పాత్రలు ఎంత గొప్పగా సహజంగా చిత్రితమైనా నాకు వాటియెడ ఆకర్షణా, సాను భూతీ కనబడవు. ఒకప్పుడు వెనకటితరంలో అట్టివారిని చిత్రించి, సంస్కారం తీసుకొచ్చి, ప్రయోజనం సాధించే అవసరం వుండేదేమో, వాటికి ఆనాడు చలామణీ ఉండేదేమో నాకు తెలీదు. అప్పుడూ,ఇప్పుడూ, ఎప్పుడూ కూడా అది కళాసృష్టికి అనువైన వస్తువు కాదనుకుంటాను. నైతిక విలువల సూక్ష్మమైన పరీక్షలో అందం వుంది. ఆ పరీక్షకి ఏదో ఒక జీవిత విధానం అందరికి అంగీకారమై స్థిరపడినది – అవసరం. మై మరచిన వ్యక్తులు యీ పరీక్షకు అతీతులు. అందుకనే వారిని చూసి జీవితంలో జాలిపడినా కళలో వారిపట్ల కలిగేది రోత.

సుధని, ఆమె భర్తని ఓ కార్లో, దీనదయాళ్‌ని మరో కార్లో సాయం పట్టి చేరేశాం. తరువాత కాస్సేపటికి కాంతారావు నేను కలసి భోజనం చేశాము.

కాంతారావు గదిలోకి పోతూ "అందరూ సుధ ప్రియులే—వారిని పోషించే భార్య లున్నప్పుడే..." అని నవ్వుతూ నిష్క్రమించాడు.

ఆ రాత్రంతా ఐస్‌ముక్కలు నుదుటిమీద పెట్టుకొని పరున్నాను.

* * *

ఆ మర్నాడు ఉదయం తొమ్మిదింటికి కాంతారావు కనిపించాడు. రాత్రి బాగా నిద్రపట్టిందా అని అడిగాడు. నేను మైకం చెందనందుకు నన్నభినందించాడు. "అసలు నే పుచ్చుకున్న దేదీ, ఊరికే పుచ్చుకున్నట్లు నటించాను" అన్నాను.

"అందుకే నాటకాలు వ్రాస్తావు" అన్నాడు. సుధామయిని గురించి నా అభిప్రాయం అడిగాడు.

"నే నింకా ఏ అభిప్రాయమూ ఏర్పరచుకోలేదు. అసాధారణ వ్యక్తిగా మాత్రం కనిపించింది" అన్నాను.

'వాళ్ళకి సంతానంలేదు. అదొక లోటు. అది మరిచిపోవడానికే యీ ప్రేమకోసం వేట-చిత్రం-మళ్ళా ఖర్తించే ఎంతో ప్రేమ అతనికి అపచారం చెయ్యలేనంటుంది. కదిపావంటే అన్నీ చెప్పేస్తుంది. కబుర్లతో నిన్ను లోబరుచుకుంటుంది. అదే ఆమె ఆనందం.'

"అంత సుళువుగా ఆనందం సాధించగలగటం గొప్ప అదృష్టం. నిన్ను కూడా లోబరుచుకుందా ?"

ఈ ప్రశ్నకి సమాధానం రాకముందే వాళ్ళ కార్యదర్శి కారులో వచ్చాడు. ముందు బైటకి వెళ్ళవల్సిన పనుందనీ, మరో గంటలో కార్యదర్శితో తన ఆఫీసు గదికి రావల్సిందనీ చెప్పి, అతను వెళ్ళిపోయాడు.

మరో జీప్‌లో "విక్రమ భట్" అనే మరో ఉద్యోగి అతనితో షికారుకి రమ్మన్నాడు. బైలుదేరుతుండగా డాక్టర్ హరికృష్ణ కారొచ్చింది. వాళ్ళ నౌకరు ఆ కార్లో వారింటికి రావల్సిందిగా సుధామయిగారు కోరినట్లు చెప్పాడు-"నాటకం విషయం మాట్లాడలటండి"-అన్నాడు. సాయంత్రం నాటకం—ఇంతవరకూ దాన్ని గురించి ఎవరూ పట్టించుకున్నట్లు లేదు. సుధామయితో మాట్లాడాలని ఉంది.

ఓ గంటలో వారింట్లో దింపుతానన్నాడు విక్రమభట్. గంటలో వస్తానన్నారని చెప్పమని సుధామయి నౌకర్ని పంపించివేసి, జీపులో బైలుదేరాము. అవీ యివీ మాట్లాడుకున్న తర్వాత, విక్రమ్‌భట్

సుధామయిని గురించి సంభాషణ మొదలెట్టాను. లోపల కుతూహలం వున్నా, దాన్ని కనబరచక, వారు చెబుతున్నారు కాబట్టి వింటున్నానని పించేటట్లు, చిన్న చిన్న ప్రశ్నలతో, వ్యాఖ్యానాలతో కొన్ని విషయాలు సేకరించాను. వెనకాల కూర్చున్న కార్యదర్శి వింటూ కూర్చున్నాడు. విక్రమ్‌భట్ ఇలా చెప్పాడు.

"సుధామయిని గూర్చి బోలెడు వదంతులున్నాయి. ఇందులో సగం ఆమెనిచూసి ఓర్వలేని స్త్రీలు సృష్టించినవి. మిగతా సగం ఆమెలో నైతిక నిజాయితీని ఒప్పుకోలేక తమ ఓటమిని సమర్థిస్తూ సృష్టించిన దుష్ప్రచారం. ఆమె చాలా మంచిది. నవ్వుతో, చూపుతో, స్నేహంతో మొగాళ్ళని సంతోషపెడుతుంది—సూర్యరశ్మిలా అందరిపైనా సమంగా ప్రసరిస్తుంది ఆమెలో వాత్సల్యం. శరీరానికి, మనస్సుకి తేడా పాతివ్రత్యం అనొచ్చు—"

"ఇవన్నీ మీకెల్లా తెలుసు!"

"నేనిక్కడ నాలుగేండ్ల నుంచి చూస్తున్నా. నే చూసిందీ, విన్నవీ—యివన్నీ కలబోస్తే వచ్చిన భావం. ఈ మనస్తత్వానికి కొంతవరకూ భర్త కారణం. దొరల పార్టీల కెళ్ళడం, అక్కడ నృత్యాలు—నాగరికులు అసూయ ప్రకటించకూడదుగా మరీ!—పరాయివాళ్ళతో చనువుకి శరీరం ఆటంకం అవకూడదుగా, పాశ్చాత్య నాగరికతలో..."

"అన్యాయం—వాళ్ళల్లోనూ వుంది బోలెడంత నైతిక చింతన".

"క్షమించండి-పోనీ — శరీరం ఆటంకం అవగూడదన్నట్లుగా నటించాలి—అని సరిదిద్దుతాలెండి. ఆ అలవాట్లని పురస్కరించుకొని, కాంతారావుగారు చొరవ తీసుకుని, మైకంలో ఏదో చెయ్యబొయ్యాడట—ఆమె లెంపకాయ కొట్టినంత పని చేసిందట. ఆ చర్యకి భర్త కూడా కోపగించుకున్నాడు. పై అధికారిపైన అల్లా చెయ్యి చేసుకుంటే తమ భవిష్యత్తేంకాను—అని బాగా గొడవపెట్టాడుట. అదే కిందధికారైతే

అసూయ; పై అధికారైతే నాగరికమైన వోరిమి! పై అధికారి గనకనే దూరంగా వుంచానండిట."

ఆఫీసు, పని, లాభనష్టాలు-మొదలైనవాటిని గురించి వో అర గంట చెప్పుకున్నాం. నేనూ, కార్యదర్శి ఆఫీసులో దిగిపొయ్యాం. కాంతారావు గదికేసి వెడుతూండగా, కార్యదర్శి కొన్ని సంగతులు చెప్పాడు.

"మీకో విషయం చెబుతా, నమ్ముతారా ? ఈ కంపెనీ కాలనీలో అందరికంటే ఎక్కువ సంస్కారం, నిజాయితీ గల మనిషి సుధామయి. అంతటి సంస్కారం గల పురుషులతో సమంగా ఎంచబడాలని, వారి స్నేహం కోరుతుంది. అది కేవలం మానసికమే. కాని మొగాళ్ళకి స్త్రీలతో మానసిక స్నేహం అర్థంకాదు-మన సమాజంలో ముఖ్యంగా పరపురుషుడితో శారీరకంగా కాక మరోరకం సంబంధం సాధ్యమని ఎవ్వరూ నమ్మరు. అందుచేత ఆమె కనపరచే చనువూ, ఆదరణ ఉదహరించి, ఇదంతా శారీరకమైందేనని, పురుషులు చేస్తున్న ప్రచారం. స్త్రీల అసూయా భావం దీనికి ప్రోద్బలం. ఆమె నిజంగా కోరింది, ప్రేమించింది, తోటమాలి తారకాన్నే. తారకం-భర్తగారింట్లో చిన్నప్పటి నుంచీ ఉండేవాడు. అయ్యగార్ని తన ప్రాణంగా చూచుకునేవాడు. నల్లగా, కండలు తిరిగిన ఉక్కు శరీరం; వొత్తైన వుంగరాల జుత్తు. ఎందు కంటారు ? వాడి కేవిధమైన సంస్కారం లేదు. సహజమైన ప్రవర్తన-ఉద్రేకాలే విజ్ఞానంగా మారిన ప్రకృతి. మానసికమైన తిక మకలు లేవు. వ్యర్థమైన ఆలోచనలతో మనస్సు మలినం చేసుకోక ప్రతి క్షణమూ, సర్వేంద్రియాల సంచలనంతో సజీవుడైన వ్యక్తి. ఆమెకి సంతానం కావాలి. శరీరం శాసించిన సహజవాంఛలను అణచిపెట్టి కృత్రిమమైన ప్రతిభగా మార్చుకున్న మేధావులకి సంతానం కలుగదు.

ఇంకా చెబుతూండగా కాంతారావ్ కనిపించాడు. సెలవు తీసుకొని తన పని చూసుకుంటానని కార్యదర్శి వెళ్ళాడు. కాంతారావ్ తన ఆఫీసు,

అక్కడ జరిగే పని, పనివాండ్రకి వారు కలగచేసే సౌకర్యాలు, వేడుకలు ప్రసూతి ఏర్పాట్లు పిల్లలకి పాలు, రీడింగ్ రూమ్, ఆటస్థలం, హాస్పిటల్, పార్కు, అక్కడి యంత్రాలు—ఇవన్నీ చూపించాడు. పార్కులో ఒక మూల ఖాళీ చేయించి, ఒక వేదిక, దానిమీద "డేరా", సాయంత్రం కార్యక్రమానికి ఏర్పాటుచేశారు. ఆహ్వానితులకు బెంచీలు, కుర్చీలు, చాపలు వేశారు.

"మరి వేషాలకి గ్రీన్ రూము ఏది ?"

'అడుగుదాం' అని కాంతారావ్ 'స్వామి'ని పిల్చాడు.

"అదే తెవల్దం లేదండి. రీడింగ్‌రూమ్ దగ్గర్లో ఉందండి. అక్కడ వేషాలేసుకుని, కార్లో కూర్చుంటే,—ఆ కారుని స్టేజికి దగ్గరగా ఉంచుతామండి. అందులోంచే వస్తూ, పోతూ ఉంటారండి."

"మరి కర్టెన్లూ అవీ ఏవి ?"

తయారవుతున్నాయండి. గురవయ్యగారి -హార్మోనియం చెడిందండి-రిపేరు కెళ్ళింది, అదీ, కర్టెన్లూ ఒకేసారి వస్తాయిండి" అన్నాడు స్వామి. ఇంతలో కాంతారావ్ టైపిస్టు "లూసి" వచ్చింది. నారింజరంగు పొడుగాటి గౌను. కత్తిరించిన ఉంగరాల జుత్తు. నడుంకి వెడల్పు బెల్టు. తన చాకచక్యం, పనిలో ప్రావీణ్యం అంతా రొమ్ములద్వారా ప్రదర్శింపగల, ముచ్చటైన విగ్రహం. సుధామయిగారు నన్నూ కాంతారావును వారింటికి రావల్సిందిగా ఫోనులో చెప్పారుట.

"ఉదయం కారు పంపింది—నాటకం విషయం ఏదో మాట్లాడాలి రమ్మని" అన్నాను.

"కోంపతీసి నాటకంలో తనే వేషం వేస్తానంటుందా ఏం ?" అంటూ కాంతారావ్ నవ్వడం సాగించాడు.

'నిన్ను కూడా రమ్మందిగా" అన్నాను.

"ఇదోరకమైన ముఖస్తుతి. ఆమె భర్తకి ప్రమోషన్ కావాలట. మా ...నా బ్రాంచిలో ప్రధాన సంక్షేమాధికారి ఉద్యోగం ఖాళీ వచ్చిం

దిలే. హరికృష్ణకి అది యిప్పించమని సూచనలు చేసింది. ఈ ఉద్యోగంలోకొచ్చి రెండేళ్ళు కాలేదు. అప్పుడే మళ్ళా ప్రమోషనా !"

ఇక్కడి వ్యక్తులందరూ, నన్నింతగా ఆదరించడానికి కారణం కాంతారావుని నే నెరుగుండడమే ననిపించింది. ప్రతివాడూ ఏదో కొంత చెప్పినా, మంచి పొంది, కాంతారావు ద్వారా ఏదో మంచి మాట్లాడి వారికి మేలుచేస్తానని లోపలి భావం సుధకూడా యిలా మంచిచేసుకోవడానికే రమ్మందేమో! కాంతారావు పెద్దఫెకారి; ఇతరులపట్ల అతని దృక్పథంవేరు. ఎవరు తనతో మంచిగావున్నా, వారేదో మేలు తనద్వారా ఆశిస్తున్నారనే. నే నెందుకల్లా గనుకోవాలి ? నాటకం విషయం మాట్లాడాలనికూడా అంది సుధామయి. కారణం ఏదైతేనేం, వెళ్ళాలని వుంది నాకు. "భోజనాలైనాక విశ్రమించి, మధ్యాహ్నం వెడుదువుగానిలే," అన్నాడు కాంతారావు. పన్నెండింటికి అతనిపని ముగించుకుని బంగళా కెళ్ళి, భోజనాలు చేశాక అతను కాసేపు విశ్రమిస్తానన్నాడు. కొన్ని పత్రికలిచ్చి, నన్నూ విశ్రమించమని చెప్పి తనగదిలో కెళ్ళాడు.

నాకు నిద్రపట్టలేదు. రాత్రి నిద్రలేక అలసిన మాట నిజమే. అది నరాల అలసట వారికి వుద్రేకం కావాలి, విశ్రాంతికాదు. ఇంకా నిద్ర లేకుండా యింకా అలిసిపోయి, నాడి, నీరసించి, ప్రాచీన శిథిలంగా చెయ్యందే విడువదు. విప్లవంచేసిన నరాల వొత్తిడి. మూడింటికి టీ పుచ్చుకున్నాను. తను వేరే పనిచూసుకుంటానని, తన కార్లో సుధగారింటికి వెళ్ళమని ఏర్పాటుచేశాడు కాంతారావు. వాళ్ళ బంగళాముందు కారు నిలిచింది. నేను ఫలానా అని తెలుసుకున్నాక నౌకర్లు లోపలిహాల్లోకి తీసుకెళ్ళి, "ఆమె యిప్పుడే బైటకెళ్ళారు. వస్తూ వుంటారు. కూర్చో" మన్నారు. కూర్చున్నాను. కాఫీపొడుంరంగు బొచ్చుకుక్క వొకటొచ్చి, కాసేపు మొరిగి నా కాళ్ళముందు ముడుచుకుని పడుంది. ఇంతలో కారు నిలిచినచప్పుడు. ఆమె రానే వచ్చింది. కుక్కకి భయపడి నేను లేవలేదు. చప్పుడికి గంతులేసుకుంటూ వెళ్ళింది నేను లేచాను.

"చూశావా మా "శాంతి" ఎంత శాంతంగా పడుకుందో పెద్ద వుద్దేశాలువున్న వ్యక్తిగనక వొస్తే పసిగట్టి పీర్చి పెంకాడేస్తుంది మీ హృదయం మంచిది కాబట్టి అల్లా బుద్ధిమంతురాలుగా పడుంది." అంటూ లోపలి కెళ్ళింది. నా హృదయం అంత మంచిదా ? నిజంగా అంత మంచిదైనా అయివుండాలి — లేక కుక్కకి పసిగట్టే శక్తి క్షీణించేనా వుండాలి — అనుకుంటుండగా ఆవిడ వచ్చింది నౌకరు బల్లమీద కూల్ డ్రింక్స్ పెట్టాడు. వచ్చిన ఉత్తరాలు విప్పి వెలుతురులో కొచ్చి కళ్ళు పెద్దవిచేసి చదువుతోంది. ఆమె కళ్ళు అంత పెద్దవికావు కనురెప్పలలో వొకటి రెండు వెంట్రుకలులేవు. ఆ ఫాకీలోంచి వింతనీడ బుగ్గలమీద పడుతోంది; ఎండలోంచి రావడంవల్ల చెమటపట్టింది. అరచేత్తో జుట్టుని పైకి తోసినప్పుడు, చెమటకి ముంగురులు తడిసి నుదిటిమీదే అతుక్కున్నాయి. బల్లమీది భూతద్దం సహాయంతో ఉత్తరం చదువుతోంది.

"ఏమండీ? కండ్లజోడు పెట్టుకోరాదా ?"

"మా వుద్యోగానికి ఏలోటున్నా పట్టించుకోరు కాని, చూపుమాత్రం బాగుండాలి. అంచేత ఎంత చత్వారం వచ్చినా, ఎవ్వరూ కండ్లజోడు పెట్టుకోరు, అందరూ అంధులైతే ఎవరు అందులో కారో చూసి తెల్సుకోలేరుగా" అన్నదామె, వుత్తరాలు మూరంగా వుంచి, సోఫాలో కూర్చుని, పమిటతో మొహం తుడుచుకుంటూ. చెమటకి జాకట్టు మడతల దగ్గర డాగైంది - తేనె పరిమళం నన్నావహించింది. నా చూపుని ఆమె గ్రహించినట్లుంది.

"నా చివరికోరిక చెప్పమంటావా? దోమలు, ఈగలులేని దేశంలో, చెమటపట్టని దేశంలో పుట్టించమని ఇప్పుడే వస్తా - యీలోగా యిల్లు చూస్తూ వుండండి" అని నౌకర్‌కి సంజ్ఞచేసి లోపలికెళ్ళింది.

నేనూ, నౌకరూ ఇల్లంతా చూడ్డానికి బైలుదేరాం చుట్టూ కాంపౌండు - గోడ; మూలగా వో చిన్నగది అందులో కుందేళ్లు—ఒక

లేడి; గదిముందు వరండాలో పంజరం, రామచిలుక — మరోమూలమైనా; లోపల గదిలో పావురాల గూడు; లోపలహాల్లో నాలుగు తైలవర్ణచిత్రాలు — ఒకటి ఆమెతల్లిది, మిగతావి "లాండ్ స్కేప్స్". కొన్ని ఫోటో లున్నాయి. ఒక దాంట్లో చిన్నప్పుడు హరికృష్ణ వున్నాడు. అప్పటికే జుట్టు వూడే సూచనలున్నాయి. పెరిగిపొయ్యే శరీరం తాలూకు పొంగూ, దబాయింపూ వున్నాయి. మరోదాంట్లో సుధామయి యవ్వనదశలోది — ఇరవైయ్యేంటాయేమో ? అందులో అంత బాగుండలేదు నుంచున్న పద్ధతిలో ఠీవి, నిబ్బరం, మానసిక శిక్షణకి గురై పరిసరాలని లోబరచుకోగల ధీమా అందులోలేవు. — ఏమిటో సగం మనిషిలా వుంది! కొందరికి పెద్దయింతర్వాత గాని నిండుతనం రాదు. మనోవికాసం శరీరానికి కూడా కొంత శక్తినిస్తుంది కాబోలు!

"కాంతారావు గారు రానన్నారా ?"

సుధామయి ఎర్రసిల్కు చీర ధరించింది బోర్డరు లేదు—అందుకే ఎత్తరిగా కనబడింది నడుంచుట్టూ వొంపుమీద చీర మడతలు లేనందున కంచుకూజాలా నీడలో మెరుస్తోంది, హాండ్ లూమ్ బాతులు - కొంగలు బొమ్మల డిజైన్ గల తెల్లజాకెట్టు. — మెడకి సూర్యకిరణాల నెక్లెస్ లేదు. అదున్న భాగంలో ఒకచోట మానినగాయం గుర్తు - అటుకేసి చూస్తు న్నాను.

"అర్జెంటుగా జరగవల్సిన కంపెనీ పనుందట — క్షమించమని చెప్పుకున్నారు."

"ఈ కంపెనీకి అవశ్యం జరగాల్సిన పని ఏమిటంటే, దీన్ని ఎత్తివెయ్యడం."

"ఏమిటండీ అల్లాగంటారు ? బోలెడు బోనస్ యిస్తున్నట్లు విన్నాను" అన్నాను.

"ఇస్తారు. మళ్ళీ రెండేళ్ళు, నెలాఖరుకి జీతాలు రావడం వుతది. - మెడమీద గాయం లెండి - చిన్నప్పుడు నేనూ అక్క, పరికిణీల కోసం కీచులాడుకున్నాం - రాసింది - కత్తిపీట మీద పడ్డాను. ఇది

చూశారా - చిటికెన వేలు — పైన పుక్క పూచింది — స్కూల్లో పిల్లలతో దెబ్బలాట ఫలితం. మరేమో యీ కనురెప్పలు డాక్టర్ గారిపని—సిగరెట్టు కాలింది. ఎందుకో ఆ వొకటీ రెండూ మళ్ళా ఎదగనే లేదు! ఈ మోకాలుపైన దీపావళినాడు సీసటపాకాయగుత్తి పేలిన కాల్పులున్నాయి. మీ కివన్నీ తెలిస్తే పారిపోతారు. కాంతారావుగారు మా ఇంటి కెందు కొస్తారు లెండి - పెద్ద వుద్యోగి. అయినా రాకపోవడమే మంచిది లెండి — మిగతావాళ్ళ ఏడుపైనా తగ్గుతుంది. చిత్రం చూశారూ! సమాజం మనచేత కొన్ని చెడ్డపనులు చేయిస్తుంది నాలుగైదుసార్లు ఒకాయన వొకామెతో చనువుగా వుంటున్నా డనుకోండి, యితరు లేమీ అనుకునే అవకాశం రాకుండా, వారిద్దరూ చాలా జాగ్రత్తగా వుంటారు. అంత మాత్రంచేత వాళ్ళు అనుకోడం మానరు పైగా పెరుగుతుంది; పరివిధాలుగా చెప్పుకుంటారు. అది వారిచెవులో పడుతుంది. జాగ్రత్తగా వున్నా యీ వదంతులుపోలేదు గనక, ఇంక జాగ్రత్తగావుండకపోతే మాత్రం జరిగే దేమిటిలే—అనుకుని గ్రంథంలోకి దిగుతారు. — అన్నట్లు మీరు గ్రంథ కర్తగా—అల్లా అనివుండకూడదేమో!" లోపలి గదిలో వొక 'పెట్టి'—పరుపు మంచం లాంటిది వుంది. ఆమె దానిమీద కూర్చుంది. ఎదురుగుండా వూగిసలాడే కుర్చీలో నన్ను కూర్చోమంది. నా కందులో బాగాలేక, ఆమెనే అందులోకూర్చోమని, నేను పక్కసోఫామీద కూర్చున్నాను. రెండుగ్లాసెస్‌తెచ్చి అందులో.ఏదో వైన్‌పోస్తోంది. పాదాలకేసి చూశాను. మడమదగర మరో మానినగాయం కనబడింది.

'ఇదా, వెన కోసారి ఒకళ్ళింటికి వెళ్ళాం. వాళ్ళకుక్క మీద కొచ్చింది. దువ్వబోయాను. పాదం కటుక్కున కొరికింది. ఇట్టే పసికట్టేస్తాయి. లోపల భయపడి పైకి ధైర్యంగా వున్నట్లు నటించబోయామా, ఆ లోపలి భయాన్ని పసికట్టి, చర్యతీసుకుంటాయి."

ఆమెని జీవితం — మనుషులు, జంతువులు ఎన్నో విధాలుగా హింసపెట్టడం చూస్తే జాలేసింది.

"పుచ్చుకోండి" అంటూగ్లాస్ నా చేతి కందిచ్చింది.

"నన్ను క్షమించండి. నా కేదైనా టీయో, కాఫీయో యివ్వండి. నా కలవాటు లేదు. నోటికి బాగుండదు పైగా లైసెన్సు. లేదు" అన్నాను నవ్వుతూ. ఆమె లేచి నిలబడి నా సోఫాపైదికొచ్చి, ఒకచేతో నాగడ్డంపైకెత్తి, గ్లాస్ నోటి కందిచ్చింది. సోప్, టాల్కంపౌడరు, యార్డ్లీ సెంట్ పరిమళం, శ్వాసలో తేనె పరిమళం నన్నుక్కిరి బిక్కిరి చేశాయి.

"నాకోసం పుచ్చుకోరూ?" అని దీనంగా చూసింది.

"ఒంటిగా త్రాగడం కంటె, నాగరికతపట్ల అపచారం లేదు. ఇదేం చెయ్యదు. మీకు నచ్చుతుంది."

కాస్త తీసుకున్నాను.

"ఉండండి. టిఫిన్ తెప్పిస్తా" అని లోపలి కెళ్ళింది. మూలగా రేడియోగ్రామ్‌వుంది. దానిమీద ఫొటోస్టాండులో మూడుబొమ్మలున్నాయి. ఒకటి 'తోరుదత్తు' పెన్సిల్‌చిత్రం, మరొకటి 'అమృతషెర్గిల్' ఫొటో, మూడోది "పావ్‌లోవాబాలె" నృత్యభంగిమ ఫొటో. నర్తకి, చిత్రకారిణి, కవయిత్రి– ఆ ముగ్గురూనూ.

ఆమెవచ్చింది. టిఫిన్ తెచ్చాడువంటాయనకాబోలు.

"మీకు కళ లంటే చాలా అభిరుచి అనుకుంటా" అన్నాను.

"మనం చెయ్యలేని పనులను చేసినవారిపట్ల వుండే ఆరాధనాభావం కాబోలు. నిజంగా నాకేమీ అభిరుచి లేదు. వారి జీవితచరిత్రలు చదివాను. అవంటే ఎక్కువ యిష్టం నాకు. తోరుదత్తు చిన్నప్పుడే చనిపోయింది. ఆ కాస్త జీవితంలో ఐదారుతరాల మానసిక పరిణామాన్ని తనలో వ్యక్తపరిచింది. ఆమె నర్తకైతే, పావ్‌లోవాలాగయ్యేది. చిత్రకారిణైతే, అమృత షెర్గిల్‌లా గయేది. ఆ ముగ్గురూ ఏరంగంలోవున్నా ఒకేలా కళాసృష్టి చేసివుండేవా రనుకొని తృప్తిపడతాను ఎటొచ్చీ నాలోకళమాత్రం లేదు. అదంతా జీవించడంలో ఖర్చయిందేమో తెలీదు, మీరు చెప్పాలి." అంది సుధ.

నే నేమీ మాట్లాడలేదు. స్త్రీల చిత్రపటాలుండొచ్చు. కాని, ఒకటి రెండు పురుషుల చిత్రపటాలు లేకపోవడం చూసి కొంత చిన్నబుచ్చుకున్నాను. పైకన్నాను.

"స్త్రీల విషయం, పురుషులకంటె స్త్రీలకే ఎక్కువగా తెలుస్తుందేమో! పురుషుడికి తెలిసినా, తనవూహలోదానికి క్రొత్త అర్థం, స్వరూపం, కల్పిస్తాడనుకుంటా. స్త్రీలు నిజంగా ఏమనుకుంటున్నారో పురుషులకి తెలిస్తే ఇంతకంటె ఇరవై రెట్లు తెగిద్దురు."

'మీరు చెప్పింది నా కర్థంకాలేదు — ఆ తికమకలు నాకు తేలీవు సుమాండీ.'

"ఏం లేదు—ఇక్కడ పురుషుల బొమ్మలు ఎందుకు లేవా? అని" అన్నాను.

'పురుషత్వంలో కాఠిన్యం, క్రౌర్యం, కళాసృష్టికి యిది చాలా అవసరము. తోరుదత్తు, అమృతషెర్గెల్, పావ్‌లోవాలలో కూడా కొంత కాఠిన్యం వుంది. వారందుకే గొప్ప కళా వేత్తలు కాగలిగారు. నాలో ఆ కాఠిన్యమే లోపించడం మూలాన, వీరినే తల్చుకొని లోలోన ఆనందిస్తానేమో! ఆ కళాశక్తిని జీవితంలో వినియోగించుకోడంలోనే ఆనందం పొందుతాను. కాని అది మన సమాజంలో సాధ్యంకాదు. ఎవరేనా మనలో సంతోషంగా వుంటే, వారేదో అపచారం చేసినట్లు భావిస్తారు. నా కిల్లా మీబోటివారితో కళలనిగురించి మాట్లాడుకుంటూ వుండాలనిపిస్తుందికాని అది వీలుపడదుగా.'

ఆమెకళ్ళలో ఏదో దిగులు. నల్ల మేఘంలోంచి వూడిపడ్డ మంచు కణంలా మెరిసింది. వెగి 'టీ కి చెమటుపోసి, పోడర్ తెలుపుని తొలగించి, జారిన కన్నీరుతో కలిసి, నీళ్ళలోపడ్డ వర్షంచినుకు అల్పమైన కెరటాన్ని లేవదీసి, గుండ్రంగా పెద్దదై ఒడ్డున విడిచినట్లు, మెడచుట్టూ జుత్తులో నిలబడి, విరిగి పడిపోతున్నాయి.

"కళవల్ల కలిగే ఆనందంకంటే గంభీరమైనదీ, శాశ్వతమైనదీ ఆధ్యాత్మికచింతన అంటారు పెద్దలు."

"నేను ఏ ఆనందం మరొకదానికంటె గొప్పది అనను, వేరు వేరు రకాలు. వాటిలో తీవ్రత, తీక్షణం, అది పొందేవారినిబట్టి వుంటుంది.

నే నేమనాలో తెలీలేదు. కళాసృష్టికి స్త్రీత్వం, పురుషత్వం రెంటి సమ్మేళనం అవసరమనీ, స్త్రీత్వం వస్తువనీ, పురుషత్వం ప్రేరణనీ, జర్మన్ మానసిక శాస్త్రజ్ఞుడు సి. జి. యూంగ్ వ్రాసిన సంగతి స్ఫురణ కొచ్చింది. కాని, అదంతా ఎల్లా చెప్పాలో తెలీదు.

"ఇంతకీ నాటకం విషయం మాట్లాడాలి అన్నారు ?" అన్నాను.

"అల్లా అంటే వస్తారని అన్నాను. నిజంగా మాట్లాడాల్సింది కూడా ఉంది లెండి" అని వరండాలో కూర్చోడానికి కుర్చీలు అవీ ఏర్పాటు చేయిస్తోంది.

"చెప్పండి" అన్నా ఓ కుర్చీమీద కూర్చుని.

"ఏం లేదు—రాత్రి మీ నాటకంలో ఓ పాత్ర వేసే ఆమె పారి పోయింది."

నాకు దిగులేసింది. ఏదో ఒక్క నాటకం వ్రాశాను. ఎన్నో అనుకూల పరిస్థితులు ఏర్పడి, దాన్ని వేసే ఏర్పాటైంది. ఎన్నెన్నో కలలుకంటూ కూర్చున్నాను. సూర్యుడి కాంతిలో ఉండి కూడా, కనబడని నక్షత్రాలకిమల్లే—ఆ కలలు ఘనీభవించి, ఈజిప్టులో పిరమిడ్లకి మల్లే అల్లా నా కనురెప్పల మీద శిథిలాలై, ముందుయుగాల పురావస్తు శాస్త్ర పరిశోధకులకు కానుకగా అర్పణ కావాల్సిందే!

"ముఖ్యమైన పాత్రా ?"

"చాలా చిన్నదే-అంతా పది నిమిషాల ఘట్టం. ఆ ఘట్టం మట్టుకు నాటకానికి ఆయువుపట్టు."

"తీసెయ్యడానికి వీలులేదూ!"

"అమ్మో"

అని తలపంకించాను. అయినా, నేటి నాటక సమాజాల స్థితిగతులు తెలుసుకోకుండా, ఇద్దరు స్త్రీ పాత్రలతో నాటకం ఎందుకు వ్రాయాలి ? నా మీద నాకు కోపం వచ్చింది ?.

"మరో స్త్రీ పాత్ర వుందటగా—పద్మ వేస్తోందిట."

"అవును."

"ఆమెచేతే యిది కూడా వేయించకూడదూ ?"

"ఆవిడ ఒకే సమయంలో యిద్దరుగా ప్రేక్షకులకు కనబడే దివ్యత్వం ఉంటేగాని అది సాధ్యపడదు. ఇద్దరూ ఒకే రంగంలో వస్తారు."

ఆ పాత్ర, ఆ ఘట్టం మార్చివేసే విషయం గురించి, అప్పుడే నా నా బుర్ర రహస్యంగా ఆలోచనలు సాగిస్తోంది. అల్లా మారిస్తే కళా సాధనలో నిజాయితీని ఆక్షేపిస్తారేమోనని ఏ మూల బెదురు.

"ఏ కుర్రాడిచేతో వేయిస్తే ?"

"అంతకంటె నాటకం మానివెయ్యడమే నాకు సమ్మతం. ఇంతకీ డాక్టరు హరికృష్ణగారేరీ ?" అన్నాను. ఆయన వుంటే ఏదేనా చేసే వాడన్న ధ్వని కలగచెయ్యాలని.

"ఆయన కోర్టులో సాక్ష్యం యివ్వడానికి వెళ్ళారు. చీకటిపడక ముందే వస్తారు."

"ఇంతకీ పారిపోవడం దేనికి—రేపుదయం వరకూ ఆగకూడదూ!" అన్నాను.

అక్కడినుండి లేచి హాల్లో కొచ్చాం. ఎదురుగా వున్న గదిలో పేము కుర్చీలమీద కూర్చున్నాము. సీసాలతో వైనో ఏదో పోసి నా కో గ్లాసిచ్చింది. ఇది పుచ్చుకుంటే ఆందోళన, మనోవ్యాకులత తగ్గుతాయంటారు. పుచ్చుకుందామని నిశ్చయించాను.

"అన్నట్లు మరిచాను—మీ కిష్టం లేదుగా. బలవంతం చేస్తున్నానేమో—క్షమించండి" అని నా చేతిలో గ్లాసు తీసుకొని తనే తాగేసింది. మరో గ్లాస్ కూడా పుచ్చుకుంది. "విషయం చెప్తాను. ఆమె బృంద—ఇక్కడ మా గుమాస్తా గోవిందం భార్య. పెండ్లయి ఏడెనిమిదేళ్ళయిందట. సంతానం కలగలేదు. రెండురోజుల క్రితం నెప్పుళ్ళు ప్రారంభమైనాయిట. దానికి కారణం తాను కాదట."

"ఎవరికైనేదేనా అనుమానం వుందా ?"

"అనుమానం ఏమిటి—దాఖలా వుందంటున్నాడు. మావారేట. ఏం చెప్పమంటారు ?"

ఇద్దరం మౌనంలో పడ్డాము. నే నీ నాటకం ఎందుకు వ్రాయాలి-ఈ మహాగంద్రగోళంలో ఎందుకొచ్చి పడాలి !

"డాక్టరుగారూ అదీ కలిసుండటం చూశాడట-హాస్పిటల్ సంక్షేమ భవనంలో. ఈవాళ నాలుగూ అడిగేశాడట. వదిలేశా అవతలికి పొమ్మని, పెట్టె, మూట బైట గిరవాటెట్టాడట. బస్సులో పుట్టింటికి పోయిందిట. అదుగో గోవిందు వచ్చినట్లున్నాడు. రా గోవిందు."

గోవిందు ఎర్రగా, పొట్టిగా వుంటాడు. బుష్ కోటు, ఆకుజోళ్ళు, విరిగిన క్లిప్పుగల కలం జేబులో-కోటు కాలర్ మధ్యలోంచి చేతులకి ఒత్తుగా పెరిగిన వెంట్రుకలు-అదీ వాలకం.

"ఏమిటి గోవిందూ! డాక్టరుగారే యీ పనిచేసిందంటున్నావట ?"

"నేనా ముక్క ఎవరితోనూ అనలేదండి. అంటే నా ఉద్యోగం మీద ఆశ వదులుకోవాలండి. నేను చెప్పినా ఎవ్వరూ నమ్మరండి. అందులో సంక్షేమాధికారి." అదోలా నవ్వాడు. గారపట్టిన ఒకటి రెండు పళ్ళు నవ్వుకి పదునిచ్చాయి.

"నువ్వే తండ్రివి ఎందుకు కాకూడదూ ? నీకు తెలీదు. డాక్టర్లు నడుగు చెప్తారు. కొంతకాలం జరిగాక, శరీరంలో మార్పులొస్తాయి. అప్పుడు సంతానం కలగడం వుంది. ఆధారంలేని యీ పిచ్చినమ్మకంతో ఆమె జీవితాన్ని, కలగబొయ్యే సంతానాన్ని పాడు చెయ్యడం మంచిది కాదు. నా మాట విను. పదినెల్లాగు పిల్లో పిల్లోడో పుడుతాడు. పోలిక తెలుస్తుంది. అప్పుడు చర్య తీసుకో నీ అనుమానం నిర్ధారణయితే, ఆ పిల్లని నే పోషిస్తాను. ఆమెను యిక్కడే వుంచి చూస్తాను. అందుకు సమ్మతం కాకపోతే నెల—కింతా అని కొంత ముట్టచెప్పించే ఏర్పాటు చేస్తాను. వెళ్ళు—తక్షణం రెడ్డిగారి జీప్ తీసుకొని వెళ్ళి, ఆమెని తీసుకురా.

ఎనిమిదికల్లా వచ్చేసెయ్యాలి. నాటకంలో వేషం వేస్తుంది. పోర్షనంతా చదివిందట. ఇదుగో ఈయనే నాటకం వ్రాసినాయన."

గోవిందు గడబిడచేసి వాదిస్తాడనుకున్నాను. అల్లాగేమీ చెయ్యలేదు. సరేనని వెళ్ళిపోయాడు. తను గుమ్మంలో కెళ్ళి అతనిచేతిలో కొంత డబ్బు పెట్టింది సుధామయి. గోవిందుకు వుద్యోగంపై రీపి నా కాశ్చర్యం కలగచేసింది. కీర్తి, ప్రేమ—ఈ రెంటికంటే విత్తానికే ఎక్కువ పలుకుబడి, ప్రభావం వుంది. అందుకనే ధనికులంటే నా కిష్టం కాబోలు!

"అమ్మయ్య" అని నిట్టూర్చాను.

నా కా ధైర్యం లేదు. వాడు సమయాని కొస్తాడని తోచదు. వీడు వెళ్ళాలి. ఆమె దొరకాలి. బ్రతిమిలాడాలి. ఆమె అంగీకరించాలి. నా కేం నమ్మకం లేదు. రాగానే మావార్ని కూడా పంపుతాను" అన్నది సుధ.

"ఇదంతా నిజమంటారా ?"

నాకేం తెలుసు – పురుషుల మాటలు, చేష్టలు, ఆదర్శాలు, ఆచరణ ! డాక్టరు గారు తన మగతనం బుజువు చేసుకోడానికి సమకట్టారేమో ! ఆయన సంక్షేమం చూసుకున్న తర్వాత కదా. యితరుల క్షేమం చూడటం – చెయ్యనిదాన్ని బట్టి స్త్రీ శీలాన్ని, చేసిన దాన్ని బట్టి పురుషుని శీలాన్ని తెలుసుకోవచ్చు."

సాయంత్రం ఐదు గంటలు దాటింది. మరి కొంచెం టీ తెచ్చి త్రాగమంది. నే వెడతానని లేచాను.

"ఏం దిగులుగా వున్నారేం ?" అన్నదామె.

"మీరు దిగులుగా వుండటం చూస్తే నాకు దిగులుగా వుందేం !"

"ఇట్లారండి"

లోపలి కెళ్ళాను. రెండు చేతులు నా గడ్డం కింద పెట్టి పైకి తోసింది. "మీ నాటకానికి భయంలేదు. ఒక నిశ్చయానికొచ్చా. ఆ వేషం

నేనే వేస్తున్నాను." నే నదిరిపోయ్యాను. గుండెలు వేగంగా కొట్టుకుంటు న్నాయి. చెమట్లు పోశాయి. నుదిటిమీద చెమటని చేతులతో తీసేసింది.

"నిజంగా-! మీ కెందు కింత..."

"ఏమో - మనం కళని గురించి చెప్పుకున్న కబుర్లే కారణ మేమో!"

"మరి మీకు వేషం ఏమిటో తెలీదు, నాటకం చదవలేదు. ఎప్పుడు కంఠస్థం చేస్తారు ?" అని అడిగాను.

"ఇప్పటి సాంఘీక నాటకాల్లో పోర్షన్ కంఠస్థం చేసే అవసరం వుండదు. రంగం మీద కుర్చీలు, బల్లలు, పుస్తకాలు వుంటాయి. వాటి మధ్య నాటకంలో తమ భాగం వ్రాత ప్రతి పెట్టుకొని చూసుకొని, చెబు తూవుండవచ్చు. వెళ్ళి నాటకం పంపండి. చదివి, తయారై వుంటాను." హాలు దాటి, గుమ్మంలో కొచ్చేశాము. నాకేసి మెత్తగా చూసి, పెదవులు మందహాసంతో తొందరగా కదిల్చింది. కార్లో దిగబెట్టిరమ్మని డ్రైవర్‌తో చెప్పింది. కారు కదిలింది.

ఇక్కడి నుండి సంగతులు వేగంగా జరిగాయి. నా కన్నీ పూర్తిగా జ్ఞాపకంలేవు. ఏది ముందో, ఏది వెనకో కూడా తెలీదు ! కార్లో కంపెనీ వారి పార్కుకు వెళ్ళాం. కాంతారావుగా రక్కడ లేదన్నారు. జనం గుంపులు గుంపులుగా గుమిగూడుతున్నారు. పగటి వేషాలతో యీ గోళంపై జరుగుతున్న జీవిత నాటకం పైబడిన తెరలా చీకటి జారుతోంది. మేఘాల అంచుల్లో కాంతి కిరణాలు రగిల్చిన ఎరుపు, బంగారు రంగులు రంగస్థలంపై ఆర్పేసిన దీపాలుగా విడిపోతున్నాయి. వీడ్కోలు గీతంలా పక్షులు చెట్లల్లో అలిసిన కంఠాలతో లయ, క్రమం లేకుండా గానం చేస్తు న్నాయి. కాంతారావుగా రెక్కడుంటారో, ఎవ్వరూ చెప్పే వారులేరు. కార్లో వారింటికి వెళ్ళాం. అంత క్రితమే అక్కడ నుంచి వెళ్ళారన్నారు. నాక్కావలసింది నాటకం వ్రాత ప్రతి. దీనదయాళ్ దగ్గర దొరకొచ్చు. అతనికోసం బయలుదేరాము. వాళ్ళందరూ ఆ సాయంత్రం కార్యక్రమా

నికి ఆహ్వానింపబడిన పై వాళ్ళ పెద్దలకు స్వాగతం ఇవ్వడానికి స్టేషన్ కెళ్ళారట. నేనూ వెళ్ళాను. దీనదయాళ్ దొరికాడు. పక్కగా పిల్చి 'నాటకం కాపీ, వొకటివ్వవలసిందని కోరాను. అందులో పాత్రధారుల నందరినీ కలుసుకోవాలి, వాళ్ళ దగ్గరికి తీసుకెళ్ళమని అడిగాను. అతనికి ఆ వివరాలు తెలీవట. సూపరెంటు శ్రీనివాసుల్ని కనుక్కోమన్నాడు. నాకు వొళ్ళు మండింది.

సాంస్కృతిక శాఖకి కార్యదర్శిగా వీణ్ణి నియోగించిందెవరు ? వాడికి అర్థం తలేదు. వెంటనే మరొకణ్ణి నియమించవల్సిందని కాంతారావుకి రికమెండ్ చెయ్యాలి. తప్పదను కున్నాను.

"కాంతారా వేడి?"

'తెలీదు' అన్నాడు – దీనదయాళ్. – దెయ్యంగాడు ! అసలు వీడు ఏ వుద్యోగానికీ తగడని వ్రాత పూర్వంకంగా కాంతారావుకి విన్న వించుకోవాలనుకున్నాను.

శ్రీనివాసుల్ని వెదుక్కుంటూ బైలుదేరాను.

"అమ్మగారు ఎదురు చూస్తుంటా రండి, కారుకోసం" అన్నాడు డ్రైవర్.

'ఫరవాలేదు – పోనీ – నే చెప్తాలే' అన్నాను ధీమాగా.

శ్రీనివాసు లింటికి చేరుకున్నాం.

ఇప్పుడే పార్కుకి వెళ్ళారన్నారు. మళ్ళా పార్కుకి పట్టమన్నా కారుని.

మైలుంటుంది అక్కడ నుంచి. రెండు మూడు ఫర్లాంగులొచ్చాక, కారు రోడ్డు ప్రక్కగా లాగి నిలబెట్టేశాడు.

"ఏం ?"

"గాలి పోతోందండి" దానికి కొత్తగా ట్యూబ్ రహితమైన టైర్లు వేశారట. అందులో గుజ్జపు నాడా దిగిందట. నేలకి దిగిపోతుందిట టైరు. ఏడు కావొస్తోంది. ఏడు యీ రిపేర్లు పూర్తి చేసేటప్పటికి నా

నాటకం ప్రారంభం కావడము. ముగియడం జరుగుతుంది కావున, నడవడం ఉత్తమమని నడక సాగించాను. ఓ ఫర్లాంగు నడిచాక జట్కాబండి కనబడింది. అందులో ఎక్కి పార్కు దగ్గరకి చేరుకున్నాను. వెతగ్గా వెతగ్గా వో అరగంటకి శ్రీనివాసులు దొరికాడు. అతని దగ్గర, నాటకం పోర్షన్ కాగితాలు తీసుకుని, వెంటనే వాటిని డాక్టర్ హరికృష్ణ గారింట్లో అందచెయ్యాలన్నాను. వాటిని జీపులో మనిషినిచ్చి పంపించాడు. వేషాలు సిద్ధం అమ్మయ్య అనుకుని నిట్టూర్చాను. వేషధారులంతా ఎక్కడని అడిగాను. దూరంగా వో చావడిలోకి తీసుకెళ్ళాడు. అక్కడ ఇద్దరు వ్యక్తులున్నారు. మిగతావాళ్ళు కాఫీలకి వెళ్ళారట. మరి వేషాలు వేసుకోడం ఎప్పుడన్నాను. పద్మ - ప్రధాన స్త్రీ పాత్ర – ఇంటి దగ్గరే తయారవుతోందిట.

"అసలు మా వేషాలేమిటో తేలడం లేదండి."

ఆ యిద్దరూ ఒక వేషం కోసం తగవులాడుకుని, యిద్దరూ ఆ వేషం పోర్షనే చూసుకుంటున్నారట. ఏ అవయవమూ సరిగ్గాలేని ఒక హార్మోనియం తాలూకు కళేబరాన్ని యిష్ట మొచ్చినట్లు వాయించేస్తున్నాడు మరో వ్యక్తి. అతన్ని ఆపమన్నాను.

"ఇందులో పాటలు - అవీ వుండవు. హార్మోనియమ్ దేనికి — మధ్య విరామం మధ్య అంటూ కూడా లేదే" అన్నాను.

దానికి సమాధానం లేదు. ప్రేక్షకుల నినాదాలు పాత్రధారులకు వినబడకుండానా ?

"లేదండి — పాత్రలు ఒక పోర్షన్ మరొకళ్ళు చెబుతుంటే, ప్రేక్షకులు గ్రహించడానికి వీల్లేకుండా" అన్నాడు శ్రీనివాసులు నవ్వుతూ. ఆ యిద్దరికీ పాత్రలు నిర్ణయించి చదవండన్నా - మధ్యలో వొచ్చే యితర వేషాల పోర్షన్స్ నేను చదువుతూ అరగంట సాగిం తర్వాత, మిగతా పాత్రధారులు కూడా వొచ్చారు - పద్మ తప్ప. ఉన్న వాళ్ళతోనే ఒకసారి చదివిద్దా మనుకుంటూండగా, కాంతారావు గాభ రమ్మన మన్నా

రంటూ వో నౌకరొచ్చాడు. అన్నీ కాంతారావు సరి చేస్తాడన్న ధైర్యం కూడా యిప్పుడు సన్నగిల్లింది. అయినా నాకు తెలీని శక్తులు అతనిలో వుండొచ్చు. తల్చుకుంటే ఏది చెయ్యలేడు? అతను గట్టిగాఅడిగితే, కంపెనీలో యావత్తు జనం వేషాలేసుగుని రంగస్థలం పైకి వురకరూ ?

అతని దగ్గరకు వెళ్ళాం. వరండాలో పది పదిహేనుగురు పెద్దల మధ్య ఆసీనుడై వున్నాడు. అల్పాహారవిందు సాగుతోంది – కేకులు, బ్రెడ్, ఒక 'హాట్', యాపిల్స్, టీ, 'బీడా', 'సిగరెట్', కాంతారావుని బైటికి ఎడంగా రమ్మని మాట్లాడాలని వుంది. కాని పిలవొచ్చా ? బాగుంటుందా ? ఇంతలో వొకాయన సినిమా పాటలు పాడటం లంకించుకున్నాడు.

ఎనిమిది దాటింది. ఇంక నాటకం ఎప్పుడు - జనం చాపల మీదా, బెంచీల మీదా, కుర్చీ మీదా నిండుకున్నారు. చెట్ల మీదా, గోడల మీదా, వరండాల మీదా పని వాండ్ర కుటుంబాలు నిలబడ్డాయి. నాటకం రక్తి కట్టాలంటే ప్రేక్షకులు బాగా వుండాలి. దానికి లోటు లేదు. కాని వీరిలో సగం పైగా పామర జనం వీళ్ళకి నాటకం రుచించదు. గోల చేస్తారు. తప్పదు. ఏగోలైనా భరిస్తాడు నాటక కర్త నాటకం ఆడుతుంటే చూడాలని సంకల్పించినప్పుడు. పుర ప్రముఖులు, పై వూళ్ళ పెద్దలు, పార్కులోకి చేరుకున్నారు. 'హార్మోనిష్టు' ఆ కళేబరాన్ని విరగగొట్టేస్తున్నాడు. దానికి జన్మ రాహిత్యం – మహా పురుషలకు కూడా సాధ్యం గానిది. తొమ్మిదైంది. కాంతారావు వేదికపైకొచ్చి – వో కాగితం చూస్తూ ఆంగ్లములో వుపన్యాసం సాగించాడు.

తమ కంపెనీ యధోచితంగా జాతి నిర్మాణ కార్యక్రమానికి పూనుకుంది. ఈనాటికి తాము సాధించిన ఫలితాలు తెలిస్తే కంపెనీ స్థాపించిన దొరగారు ఎంత సంతోషిద్దురో – ఆయన చనిపోయి నలభై సంవత్సరాలైనా, ఆయన ఆదర్శాలు, పట్టుదల, దయ వారికి అంగరక్ష. ఐహిక రంగంలోనే గాక, సాంస్కృతిక రంగంలో కూడా తాము

వుడుతా భక్తి అన్నట్లు కొద్దో గొప్పో సేవ చేస్తూనే వున్నారు. వారీ విధంగా పనిచేస్తే పంచవర్ష ప్రణాళిక జయంగా కొనసాగి, దేశాభ్యుదయానికి తోడ్పడి, జాతి పురోగమనానికి అంతర్జాతీయ శాంతి స్థాపనకి పునాదులు వేస్తున్నామంటే అతిశయోక్తి లేదు.

జనం చప్పట్లు కొడుతున్నారు.

తాము చేస్తున్న సత్కార్యానికి నిదర్శనం నేడు సమావేశమైన ప్రేక్షక జనం.

సమయానికి ఆహ్వాన పత్రాలు అందక పోయినా, వొందలాదిగా వొచ్చి, తమకు సలహాల నిచ్చిన యీ అతిథులకు కృతజ్ఞత ఎల్లా ప్రకటించాలో తెలీడంలేదు. (చప్పట్లు)

ఈనాటి కార్యక్రమంలో కొద్ది మార్పు జరిగింది. అందుకు సభికులు మన్నించాలి. అనుకున్న నాటకానికి బదులు పంచవర్ష ప్రణాళికని గూర్చి బుర్ర కథ ఏర్పాటైంది. (చప్పట్లు)

తనకి అవతల చాలా తొందర పని వుండడంవల్ల తాను చివరి దాకా వుండలేక పోయినందుకు చింతిస్తున్నాననీ, తన స్థానంలో కార్యక్రమం నడిపే లాజరస్ గారికే ఎక్కువ అర్హత వున్నదనీ — వుపన్యాసము ముగించాడు కాంతారావు. చప్పట్లు కొడుతూనే వున్నారు. అతను బైటకొచ్చాడు.

ఆ రాత్రి భోజనాలు చేసి, మా గదులకు చేరేప్పటికి పదకొండైంది.

"మరోసారి మంచివాళ్ళ చేత యీ నాటకం ఆడిద్దాం. మంత్రులను కూడా ఆహ్వానిద్దాం" అన్నాడు కాంతారావు. సీసా కార్కు తీసి గ్లాసులో ద్రావకం పోస్తూ.

"ఇప్పుడు వెయ్యక పోవడమే మంచిది."

బాగా చెప్పావ్ - ఈ గ్లాస్ తీసుకో — ఇది "వెయిర్ మూత్," చాలా మంచిది. హాయిగా నిద్రపడుతుంది.

"నా కొద్దు."

"పోనీ, నిమ్మరసం ఐస్‌లో కలిపిస్తాను. తల నొప్పా ?"

"ఏం లేదు ?"

"కోడోపైరిన్ – టాబ్లెట్ వేసుకో – తలనొప్పి తగ్గి, నిద్ర పడు తుంది." అతను గదిలో కెళ్ళి పొయ్యాడు. నేనూ నా గదిలో కెళ్ళి పరు న్నాను. తల పగిలిపోతూంది. – కణతల మీద సుత్తితో కొడుతున్నట్లు ఆ హార్మోనియమ్ చప్పుడు చెవులో పీడగా గానం చేస్తూంది.

ఆధునిక నాటక రంగం గురించి ఘాటైన వ్యాసాలు వ్రాయాలి. వెనకటి నాటకాలు పోయినై. ఆధునిక నాటకం పుట్టలేదు. నటీ నటులు లేరు. ఆడుకొనేందుకు భవనాలు లేవు. వాద్యాలు లేవు. నడిపే నాథుడు లేడు. స్త్రీ పాత్రలు దొరకవు. వొకవేళ దొరికినా, నాటకం నాడు లేచి పోతారు. ఈ పరిస్థితులు తెలుసుండే వ్రాస్తున్నారా నాటక రచయితలు ? పరిస్థితులు తెలుసుకోకుండా వీరు వ్రాయడం దేనికి ? తీరా అన్నీ సక్ర మంగా నిర్వహించి నాటకం ఆడితే, ఆనందించే ప్రేక్షక జనం వున్నారా? ప్రతి వాడూ వో నాటకం వ్రాయడం, తన సమ్మతి లేందే దాన్ని ఎవ్వరూ ఆడకూడదంటూ, మొదటి పేజీ మీద లాయర్ నోటీసివ్వడం – మహా యీ నాటకం ఆడాలని ఆంధ్రావని పరితపిస్తూన్నట్లు – ఇవన్నీ బైటపెట్టి, వ్రాసే వాళ్ళని విమర్శిస్తూ సుదీర్ఘమైన వ్యాసం వ్రాయాలి. వాక్యాలు నిర్మాణం చేస్తూ నిద్రపోయే టప్పటికి మూడైందో నాలుగైందో తెలీదు. లేచేటప్పటికి ఏడు దాటింది. అయ్యగారు రమ్మంటున్నారని నౌకరు పిలిచాడు. కాంతారావు స్నానం చేసికొని ముస్తాబై టిఫెన్‌కి కూర్చున్నాడు. నన్ను చప్పున స్నానం చేసి రమ్మన్నాడు. క్షురకర్మ చేసుకోవాలన్నాను.

"సరే, నేను మళ్ళా ఓ గంటలో వొస్తాను. సిద్ధంగా వుండు. సీ రైలు తొమ్మిదింటికి అన్నాడు.

స్నానంచేసి సిద్ధం అయ్యేప్పటికి ఎనిమిది దాటింది. టిఫెన్

పుచ్చుకున్నాను. శ్రీనివాసులు పె సల్లపెట్టె తీసుకుని చక్కా వచ్చాడు. మొదట్లో అది హార్మోనియమ్ అనుకుని భయపడ్డాను. అందులోవన్నీ త్రాగుడు సీసాలు. వాటిని తీసి రిఫ్రిజిరేటర్‌లో పెడుతున్నాడు.

"రాత్రి బాగా జరిగిందా ?

పదకొండెందండీ. కిక్కురుమనకుండా చూస్తున్నారు జనం.'

"నాటకం వాళ్ళు ?"

"సీతావనవాసం వీధి నాటకంబృందంలో కలిసి దంచేశారు.'

"బృంద రాలేదా ?"

"లేదు"

"సుధామయిగారు ?"

"నే అన్నానని చెప్పకండి. ఆవిడ లేచిపోయిందను కుంటున్నారు.'

"ఎవరితో ?"

"నాకు తెలీదు."

శ్రీనివాసులు వెళ్ళిపోయ్యాడు. ఆ ముక్క నా చెవిని పడెయ్యడంలో అతనికి మనశ్శాంతి చేకూరింది. నేనది నమ్మలేను. కాంతారావు కార్లో వచ్చాడు స్టేషన్‌కి బైలుదేరాం.

"నేను వస్తా" అన్నాడు కాంతారావు.

ఇది వోదార్పు వీడ్కోలనుకున్నాను. పెట్రోల్ కోసం కారు నిలిచింది. ఎదురుగా డాక్టరు హరికృష్ణ బంగళా. గేటు వెనక గుబురుగా ఎదిగిన గడ్డిని కత్తిరిస్తున్నాడు తోటమాలి. చామనచాయ ఎత్తుగావున్నాడు పెద్ద చింపిరిజుట్టు కండలు ఎండకి చెమటలో నిగనిగలాడుతున్నాయి. చేతి కదలికకి లయ కలుపుతూ బుజాన, వెన్ను మీద, మెడ, తొడ, నడుం పైన కండరాలు, నరాలు వొంపులు తిరిగి కదులుతున్నాయి. పురుషత్వం అంటే అది – సృష్టికి మూలమైన యంత్రం అది. ఆ శక్తి రాతి శిల్పం

పెనగాని వ్యక్తంగాడు. తోటమాలి శరీర చూస్తే ఏ శిల్పి సంతో షించడు ? ఆ కదలికలోని సౌందర్యం, ఏ రాతివిగ్రహం చూపగలదు ? చేతగాక, శిల్పులు తమతలలు ఆ రాతికేసి పగలగొట్టుకోవాలి? కార్యదర్శి సుధామయి ఒక్క తోటమాలినే నిజంగా ప్రేమించిందన్నమాట జ్ఞాపకం వచ్చింది. అది నమ్ముతాను. వాడిలో సంస్కృతి, నాగరికతలేవు. వాటి వల్ల వచ్చే బిడియము, దాపరికము, అసహజమైన సభ్యతలేవు. స్వచ్ఛ మైన స్థూలమైన ఇంద్రియానుభూతి – అందలి తీక్షణాన్ని, ప్రతిభను అనుభవించగల సంస్కారం ఆమెలో వుంది.

ఆ తోటమాలి తారకం కాబోలు ఎంతధన్యుడు! వాడు నాటకాలు వ్రాయడు. వ్రాసేవాళ్ళని ఎరగడు. ఆ మట్టిలో, ఆ గడ్డిలో మేఘాల క్రింద గాలిలో చెమటకి తడిసి, ఎండకి ఎండి ప్రకృతి పెరుగుదలతో తన శక్తులు పెంచుకుంటూ, సృష్టిని తన శరీరంలో బంధించివేసి, ప్రేరణకి శిఖరాన్నందుకొన్న పరిపూర్ణతని నింపుకొని, ఎక్కడో, ఎప్పుడో ప్రజ్వరిల్లుతాడు. మనస్సు వుండదు. శూన్యత్వాన్ని శోధించి విశ్వంలోని శూన్యత్వంలో ఐక్యతపొందిన ధన్యజీవి ఆ తోటమాలి! పై కనేశాను.

"తోటమాలిని ప్రేమించిందిట సుధామయి !"

నీ కప్పుడే తెలిసిందీ! అవును అదొక చిత్రమైనగాథ. చివరిదాకా మా కెవ్వరికీ తెలియదు. రోజూ వాణ్ణి చూస్తూనే ఉన్నాం – కాని వాడింత కథానాయకుడవుతాడనుకోలేదు."

"అడుగో అటు చూడు–వాడేగా ?" అన్నాను గేటుకేసి చూపుతూ.

"ఇంకా నయం...వీడుకాడు. వాడు తారకం చనిపోయి ఏ ది దాటింది. వీడెవడో–మరోడు."

"చనిపొయ్యాడా ?"

"ఆత్మహత్య చేసుకున్నాడు."

"ఎందుకో ?"

"వాడు చిన్నప్పటినుండీ హరికృష్ణ గారింట్లో వుండే నౌకరు.

అతన్ని తండ్రితో సమంగా చూసేవాడు. అతని భార్య తనని కోరిందని తెలుసుకోగానే వాడి హృదయం చెడిపోయింది. తృణీకరిస్తే ఆమెకి బాధ; అంగీకరిస్తే యజమానిపట్ల అపచారం.

"ఇదంతా ఎల్లా తెలిసింది ?"

"వాడో ఉత్తరం వ్రాశాడు - సుధామయికి — అది నా చేతులో పడింది. ఆమె తనను కోరింది అన్న విషయం వాడికి చెప్పరాని ఆనందం కలుగజేసిందట. ఆ ఆనందం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాడట."

నే నాలోచనలోపడ్డాను. ఒకజీవికి అంతటి ఆనందం నైతికచింతన కలగచేసిందంటే ఆమె ఒక గొప్పకార్యం సాధించిందనుకున్నాను. ఆ కథ విని, ఆమె పరిచయం పొందడంతో నేనూ నైతికంగా ఓ అంతస్తు పైకి నడచినట్టనిపించింది. నైతిక జీవితంలోని సూక్ష్మమైన కొత్త ప్రాంతాన్ని శోధించాను.

"రాత్రి లేచిపోవడం ఏమిటి ?"

"లేచిపోయిందా ? నే వినలేదే! రాత్రి ఎనిమిదింటికి తన అక్క గారికి జబ్బుగావున్నట్టు టెలిగ్రాం వస్తే వెంటనే బైలుదేరి వెళ్ళింది - వినోదాలకోసం వేరేవుంచిన డబ్బు కాస్తా తీసుకువెళ్ళింది. నాతో చెప్పే వెళ్ళింది. కంపెనీ సొమ్ము. ఆమెకు డబ్బుపట్ల ఏమాత్రం సిజాయితీ లేదు" అన్నాడు కాంతారావు. నన్ను స్టేషన్లోదింపి, టికెట్ కొనిచ్చి, రైలుకోసం చూస్తూండగా రైలొచ్చింది. రాత్రంతా జస్టిని, పళ్లు పీకుతున్నట్లనిపించి వేళ్ళతో కదుపుతున్నాను.

'మనందరికీ పళ్ళబాధ—సుధామయికి మాత్రం లేదు' అన్నాడు.

'ఏం ?'

"ఆమెవి పెట్టుకున్న పళ్లు చిన్నప్పుడు అల్లరిచేస్తే వాళ్ళ నాన్న మూతిమీద కొట్టాడట. ఒక్క వంకరపన్ను వికృతంగా వుందని అన్నీ వూడపీకించి కొత్తవి పెట్టించుకుంది."

రైలు కదిలింది. సెలవు తీసుకొని వెళ్ళిపొయ్యాడు కాంతారావు. నా బాధ తగ్గింది. నాటకం ఆడలేదన్న చింత పటాపంచలైంది. నాలో ఏదో మాలిన్యం దిగజారింది.